ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 13.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 352 పేజీలు:12 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



13 ఏళ్ల నరకయాతనకు విముక్తినిచ్చిన 'సుప్రీం'

సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. కారుణ్య మరణాలు ఇటీవల పెరుగుతున్నాయి. కారణం ఏదైనా కారుణ్య మరణం కోసం కోర్టును ఆశ్రయిస్తున్నారు. విచారణ తర్వాత చాలా వరకు తిరస్కరణకు గురవుతున్నాయి. అయితే కొన్నింటిని మాత్రం కోర్టు కూడా అంగీకరిస్తోంది తాజాగా 13 ఏళ్లుగా కోమాలో ఉన్న 32 ఏళ్ల హరీశ్ రాణాకు సుప్రీంకోర్టు కారుణ్య మరణం అనుమతించడం భారత న్యాయ చరిత్రలో చారిత్రాత్మక సంఘటనగా నమోదైంది. అతడికి ప్రాణాధార చికిత్స వ్యవస్థలను తొలగించడానికి సుప్రీం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం దేశంలో ఈ విధానానికి మొదటి సారి ఇచ్చిన అనుమతి.ఓ మనిషి కారుణ్య మరణానికి అనుమతినిచ్చింది. 12 సంవత్సరాలకు పైగా కోమాలో ఉన్న 31 ఏళ్ల వ్యక్తికి సుప్రీంకోర్టు బుధవారం పాసివ్ యుథనేషియా మంజూరు చేసింది. అతని కృత్రిమ లైఫ్ సపోర్ట్‌ను తొలగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. పాసివ్ యుథనేషియా అనేది ఒక రోగిని ఉద్దేశపూర్వకంగా ప్రాణాలతో ఉంచడానికి అవసరమైన లైఫ్ సపోర్ట్. ఇతర చికిత్సను నిలిపివేయడం ద్వారా చనిపోవడానికి అనుమతించే ప్రక్రియ.ఘజియాబాద్‌కు చెందిన 31 ఏళ్ల హరీష్ రాణాకు దేశ అత్యున్నత న్యాయస్థానం నిష్క్రియాత్మక కారుణ్య మరణాన్ని మంజూరు చేసింది. తన కొడుకు మరణాన్ని కోరుతూ తండ్రి సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకున్నాడు. న్యాయమూర్తులు జెబి పార్దీవాలా, కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది.అనాయాస మరణం కోరుతూ దాఖలైన పిటిషన్‌పై తీర్పు వెలువరిస్తూ, జస్టిస్ జె.బి. పార్దీవాలా నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "దేవుడు మనిషిని జీవితాన్ని అంగీకరిస్తున్నాడా లేదా అని అడగడు, జీవితాన్ని అతనే తీసుకోవాలి." అని పేర్కొన్నారు. గత 12 సంవత్సరాలుగా మంచం పట్టిన 31 ఏళ్ల హరీష్ రాణాకు ఇప్పుడు కారుణ్య మరణం మంజూరు కానుంది. గౌరవప్రదమైన మరణ హక్కును గుర్తిస్తూ 2018 కామన్ కాజ్ నిర్ణయం తర్వాత కారుణ్య మరణం అనేది మొదటి న్యాయపరమైన నిర్ణయం. తన తీర్పును వెలువరించే ముందు, హరీష్ కోలుకునే అవకాశం లేదని తేల్చిన రెండు కోర్టు నియమించిన వైద్య బోర్డుల నివేదికలను ధర్మాసనం పరిశీలించింది. ఘజియాబాద్‌లోని రాజ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో నివసించే హరీష్ తల్లిదండ్రులు దాఖలు చేసిన పిటిషన్ ప్రకారం, అతను 12 సంవత్సరాలుగా మంచానికే పరిమితమయ్యాడు. అతనికి ద్రవ ఆహారం మాత్రమే ఇస్తున్నారు. 2013లో తన ఇంటి నాల్గవ అంతస్తు నుంచి పడిపోవడంతో హరీష్ రాణా తలకు తీవ్ర గాయాలయ్యాయి. దశాబ్ద కాలంగా కోమాలో ఉన్నాడు. వైద్య చికిత్సను ఉపసంహరించుకునేలా హరీష్‌ను పాలియేటివ్ కేర్‌లో చేర్చాలని ధర్మాసనం ఎయిమ్స్ ను ఆదేశించింది. అతని గౌరవాన్ని కాపాడుకోవడానికి ఒక నిర్దిష్ట ప్రణాళికతో ఈ ఉపసంహరణ చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది.తీర్పు వెలువరించే ముందు హరీష్ రాణా తల్లిదండ్రులను కలవాలని సుప్రీంకోర్టు కోరిక వ్యక్తం చేసింది. ఢిల్లీకి చెందిన ఎయిమ్స్‌కు చెందిన సెకండరీ మెడికల్ బోర్డ్ ఆఫ్ డాక్టర్లు దాఖలు చేసిన హరీష్ రాణా మెడికల్ రిపోర్టుతో కూడిన నివేదికను చూసి, అది విచారకరమైన నివేదిక అని పేర్కొంది. రోగి పరిస్థితిని పరిశీలించిన తర్వాత, ప్రాథమిక వైద్య బోర్డు అతను కోలుకునే అవకాశం చాలా తక్కువ అని తేల్చి చెప్పింది. డిసెంబర్ 11న, ప్రాథమిక వైద్య బోర్డు నివేదిక ఆ వ్యక్తి పరిస్థితి చాలా విషమంగా ఉందని సూచించిందని సుప్రీంకోర్టు పేర్కొంది. 2023లో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, రోగికి కృత్రిమ లైఫ్ సపోర్ట్‌ను తొలగించడంపై నిపుణుల అభిప్రాయాన్ని పొందడానికి ప్రాథమిక, ద్వితీయ మెడికల్ బోర్డును ఏర్పాటు చేయడం తప్పనిసరి అయ్యింది. అరుణాకు కారుణ్య మరణం అనుమతించాలని జర్నలిస్ట్ పింకీ విరాణి సుప్రీంకోర్టులో 2011లో పిటిషన్ దాఖలు చేసింది. కోర్టు చికిత్సను నిలిపివేసి సహజ మరణం (పాసివ్ యూతనేషియా) అనుమతించాలని నిర్ణయించింది, కానీ బాధితుడి తల్లిదండ్రులు, భాగస్వామి లేదా సన్నిహితుల అనుమతి తప్పనిసరిగా నిర్దేశించింది. 'నెక్స్ట్ ఫ్రెండ్'గా పింకీని నిరాకరించి, ఆసుపత్రి సిబ్బందిని సూరిగా నియమించింది, వారు చికిత్స నిలిపివేయడానికి ఒప్పుకోకపోవడంతో పిటిషన్ తిరస్కరించబడింది. నాలుగు దశాబ్దాలుగా జీవచ్ఛవం వల్ల ఉన్న అరుణా 2015లో న్యుమోనియాతో మరణించిందిఅరుణా కేసు ఆధారంగా 2018లో సుప్రీంకోర్టు 'గౌరవప్రద మరణం'ను ప్రాథమిక హక్కుగా గుర్తించి పాసివ్ యూతనేషియాను అధికారికంగా చట్టబద్ధం చేసింది. హరీశ్ రాణా (ఇంజినీరింగ్ విద్యార్థి) 2013లో చండీగఢ్ యూనివర్సిటీ హాస్టల్ నాలో అంతస్తు బాల్కనీ నుంచి పడిపోయి తలకు తీవ్ర గాయం కారణంగా 13 ఏళ్లు కోమాలో ఉన్నాడు.

ప్రతిపక్షం
హైదరాబాద్
శుక్రవారం
13.03.2026

శుద్ధ సంకల్పం.. సాధనలో నిజాయితీ

పెద్ద పార్టీ అండలేదు..అధికార హోదా లేదు..ధనబలం అంతకన్నా లేదు..కానీ ఎంచుకున్న అంశంలో బలం, వెళ్తున్న మార్గంలో నిబద్ధత కవిత పట్ల జనంలో పెరుగుతున్న ఆదరణకు కారణమవుతున్నది. ముగ్గురు మంత్రుల కుట్రకు వెనుక ఉండి మద్దతిస్తున్న సీఎం కూడా పునరాలోచించుకోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి.



లోక రవిచంద్ర
9491331533

నిజాయితీకి ఎవరైనా తలవంచాల్సిందే.. అధికారమదంతో అమాయకులను ముంచే నయవంచకుల దగాకోరు పనులు కూడా నిజాయితీ పరుల ముందు నిలువునా బూడిద కావలసిందే. అది మరోసారి ఋజువైంది. పేదల కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు చేస్తున్న పోరాటానికి స్పందన చూస్తే అదే అనిపిస్తున్నది. బాధితుల కోసం ఉద్యమిస్తున్న కవితకు వస్తున్న పౌర స్పందన ఆమె నిజాయితీని నిరూపిస్తున్నది. అడిగేవాడు లేడన్న అహంకారంతో పేదల గూడు కూల్చిన సర్కారు దిగిరాక తప్పలేదు. పోరాటంలో నిజాయితీ ఉంటే అన్నివర్గాలు కలిసి వస్తాయన్నది స్పష్టమైంది.

అధికార దురహంకారం

తెలంగాణలో సాగుతున్న అరాచక పాలనకు తలొగ్గిన పక్షాలన్నీ నిర్వీర్యమైతే ప్రధాన ప్రతిపక్ష పాత్రలో జాగృతి జనం బాధలను తన బాధగా స్వీకరిస్తున్నది. ఖమ్మంలోని వెలుగుమట్లలో భూదాన్ భూముల్లో పేదల ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చిన సర్కారు కార్పొరేట్ వ్యవస్థలకు రెడ్ కార్పెట్ సిద్ధం చేసింది. రక్తాన్ని చెమటగా చేసి కట్టుకున్న నీడ కళ్లముందే కూలుతుంటే పేదలు కన్నీరు మున్నీరయ్యారు. గుండెలవిసేలా ఏడ్చారు. మంత్రులుగా మారిన రియాల్టర్లు, బడా కాంట్రాక్టర్ల మనసు కరగలేదు. ఎదురుతిరిగే ధైర్యంలేని బాధితులకు అండగా నిలవాల్సిన రాజకీయ పక్షాలు పిక్నిక్ లా వెళ్లి పలకరించి వచ్చారు. శవాలపై పేలాలు ఏరుకునే ప్రతిపక్ష పార్టీలు మొసలి కన్నీరు కార్చి వచ్చారు. కానీ బాధితుల గుండె గోసను మనసుతో విన్న ఉద్యమబిడ్డ కల్వకుంట్ల కవిత కదం తొక్కింది. మనం బతుకుతున్నది ప్రజాస్వామ్యంలోనా..రాచరిక పాలనలోనా అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. బాధితులను అక్కున చేర్చుకుని ఓదార్చారు. వారికి న్యాయం జరిగే వరకు వెనక్కు తగ్గేది లేదంటూ ఉద్యమించారు.

ప్రజాసంఘాల మద్దతు

వెలుగుమట్లలో సుమారు 750 కుటుంబాలు నివాసముండే చోట ప్రభుత్వం అక్రమంగా నేలమట్టం చేసిన ప్రాంతాన్ని కవిత సందర్శించారు. భూదాన్ భూముల్లో చట్టబద్ధంగా కట్టుకున్న ఇండ్లను బుల్డోజర్లతో దుర్మార్గమైన రీతిలో కూల్చిన వివరాలు ఆరాతీశారు. నోటీసులు లేకుండా పిడుగుపాటులా తాకిన సర్కారు దెబ్బకు విలవిలలాడుతున్న నిర్వాసితులకు అండగా ఉంటానని ప్రకటించారు. నిర్వాసితులకు ఆశ్రయం కల్పించిన అంబేద్కర్ భవన్ లో దుర్భర పరిస్థితులను చూసి చలించిపోయారు. పశువుల కొట్టంలా ఉన్న చోట వందలమందిని ఉంచడం ప్రభుత్వ అమానుషత్వానికి నిదర్శనంగా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రభావితం చేసి వేల కోట్ల విలువైన పేదల భూమిని కబ్జా చేయడానికి ముగ్గురు మంత్రులు వేసిన పన్నాగంగా అర్థమైన మరుక్షణం ఉద్యమ నాయకురాలు కవితను ఆగ్రహానికి గురిచేసింది. పేదలకు నిలువ నీడలేకుండా చేసిన అధికార పార్టీ నేతల స్వార్థం ఆమెను ఒక్క క్షణం కూడా ఆగనీయలేదు. బాధితులకు న్యాయం చేయించే బాధ్యతను భుజాన వేసుకున్నరు. అప్పటికప్పుడే నిర్ణయం తీసుకుని నిరవధిక నిరాహారదీక్షకు పూనుకున్నరు. పేదలకు న్యాయం చేయాలన్న కల్వకుంట్ల కవిత ఆశయానికి రాష్ట్ర వ్యాప్త మద్దతు లభించింది. ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ కవిత వెంట నడవడానికి సిద్ధమయ్యారు. ఖమ్మం ప్రజా సంఘాలు ఆమెను వెన్నుతట్టి ప్రోత్సహించాయి. ఒక్కసారిగా ఉద్యమరూపం ఎత్తుకున్న కవిత ఖమ్మం పర్యటనపై రాష్ట్రవ్యాప్త దృష్టి పడింది. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూబాధితుల గోస రాష్ట్ర ప్రజల దృష్టికి వచ్చింది. తమ కోసం ఉద్యమం ప్రారంభించిన కవితలోని నిజాయితీని గుర్తించిన నిర్వాసితులకు ఆమెపై నమ్మకం పెరిగింది. అంతకుముందు పిక్నిక్ లా వచ్చిపోయిన రాజకీయ నాయకులను చూసి విసిగిపోయిన బాధితులు కవిత పట్టుదల కట్టిపడేసింది. కవిత పోరు అగ్గిలా రాజుకుంది. సర్కారు వెన్నులో వణుకు మొదలైంది. తెల్లారే సరికి ఖాకీదండు కవిత దీక్షను విఫలం చేసేందుకు అందర్నీ అక్కన్నుంచి హైదరాబాద్ తరలించారు. అయినా కవిత తన పోరాటాన్ని ఆపకుండా నిరవధిక నిరాహారదీక్షను కొనసాగించారు.



కదిలిన ప్రభుత్వం

ఖమ్మంలో నిరాహారదీక్షను పోలీసులు అడ్డుకున్నా హైదరాబాద్ బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యాలయంలో కవిత కొనసాగిస్తున్న ఆందోళనకు విశేష స్పందన వస్తున్నది. వెలుగుమట్ల బాధితులకు మళ్లీ ఇండ్లు కట్టిస్తామని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు తన దీక్ష విరమించేది లేదంటూ ఆమె చేసిన ప్రకటనలోని నిజాయితీని తెలంగాణ సమాజం గుర్తించింది. గతంలో కవిత వివిధ సందర్భాల్లో లక్ష్యసాధన కోసం అనుసరించిన విధానాలు ఆమె పట్ల నమ్మకాన్ని పెంచాయి. బాధితులకు న్యాయం చేయడంలో తామూ భాగస్వాములు కావాలన్న ఉద్దేశంతో భారీ సంఖ్యలో కవితకు మద్దతు తెలుపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ ప్రజాసంఘాలు కవితను కలిసి సంఘీభావం ప్రకటించాయి. భారీ సంఖ్యలో జనం తరలి వచ్చారు. కవిత దీక్షకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహిస్తున్నారు. కవిత ఉద్యమం వల్ల బాధితులకు న్యాయం జరుగుతున్న నమ్మకం పెరుగుతున్నదనడానికి ఇది నిదర్శనంగా నిలుస్తున్నది. తెలంగాణ జాగృతి అధినేత్రి దీక్షతో ఇప్పటికే ప్రభుత్వంలో కదలిక వచ్చింది. వెలుగుమట్ల నిర్వాసితులకు పట్టాలిచ్చి ఇండ్లు కట్టించేందుకు నిర్ణయం తీసుకున్నది. పెద్ద పార్టీ అండలేదు..అధికార హోదా లేదు..ధనబలం అంతకన్నా లేదు..కానీ ఎంచుకున్న అంశంలో బలం, వెళ్తున్న మార్గంలో నిబద్ధత కవిత పట్ల జనంలో పెరుగుతున్న ఆదరణకు కారణమవుతున్నది. ముగ్గురు మంత్రుల కుట్రకు వెనుక ఉండి మద్దతిస్తున్న సీఎం కూడా పునరాలోచించుకోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వెలుగుమట్లలో కూల్చిన చోటనే కొత్త ఇండ్లు కట్టి ఇవ్వాలన్న కవిత డిమాండ్ నేరవేరాలని ఆశిద్దాం.

(వ్యాస రచయిత స్టీరింగ్ కమిటీ సభ్యులు, తెలంగాణ జాగృతి)



తొలి తెలుగు కవయిత్రి మొల్ల

సీ.ప.మా : శ్రీయః
కరుదయిన శ్రీ కంఠ మల్లేష
కృపతోడ రాసి సుకృతిని తాను
తొలితెల్గు కవయిత్రి
నిలలోన మొల్ల గా
వాసికెక్కినయట్టి వనిత మొల్ల
తెల్గుపల్కుబడుల
వెల్గుజిలుగులతో
కంద పద్యాలను
ఘనము వ్రాసి
చక్కనయినభావ
సత్పమత్కారముల్
సొంపుతో కూర్చగా
యింపు గొలుపె
సత్కావ్య సిద్ధికై
సంకల్పమునుజేసి
ఉల్లమలరునట్లు మొల్ల తాను
రామాయణము రాసి రసర
మ్యరీతితో
శాలివాహనవంశ
చరిత నిలిపె !
ఆ.వె: కుమ్మరింట బుట్టి
గొప్ప కోవిదురాలు
జాను తెలుగు లోన చక్కగాను
రామకథను వ్రాసె
రమణీయ శైలిలో
శైవభక్తురాలు సాధ్వి మొల్ల !



కొడిచెల్లి రామానుజ
తెలుగు
భాషోపాధ్యాయురాలు
సిద్దిపేట.
96665 11372

రమజాన్ అంతరంగం

ఆత్మప్రక్షాళన, త్యాగం దైవ సాన్నిధ్యం



ముహమ్మద్ ముజాహిద్
9640622076



మానవ జీవన యానంలో ఆత్మను సంస్కరించుకోవడానికి, హృదయాన్ని మాలిన్య రహితం చేసుకోవడానికి ప్రకృతి ప్రసాదించిన అపురూపమైన వసంతం...రమజాన్. ఆకాశంలో నెలవంక మెరవగానే విశ్వమంతా ఒక దివ్యమైన నిశ్శబ్దం అలుముకుంటుంది. ఇది కేవలం ముస్లింల పండుగ మాత్రమే కాదు, మానవత్వానికి నైతికతను అద్దే ఒక మహోన్నత శిక్షణా శిబిరం. రమజాన్ మాసం అంటే కేవలం పగలు తినకుండా ఉండటం కాదు; అది పంచేంద్రియాల మీద విజయం సాధించడం, పరపీడనను అర్థం చేసుకోవడం, సృష్టికర్తతో అనుసంధానమవ్వడం. ఈ ఆధ్యాత్మిక ప్రయాణంలో మూడు మజిలీలు అత్యంత ప్రధానమైనవి: ప్రాయశ్చిత్త రూకలైన ఫిదియాకఫ్ఫారా, ఏకాంత ఆరాధన ఏతెకాఫ్, లైలతుల్ ఖదర్..

1. కరుణా మలయ మారుతం: ఫిదియా -కఫ్ఫారా

ఇస్లామీయ ధర్మశాస్త్రం కేవలం ఆజ్ఞల సమాహారం కాదు, అది అపారమైన కరుణతో నిండిన జీవన సూత్రం. రమజాన్ ఉపవాసం ప్రతి ఆరోగ్యవంతుడికి విధి. కానీ, మనిషి బలహీనతలను, శారీరక పరిమితులను దైవం మన్నిస్తాడు. ఇక్కడే 'ఫిదియా' అనే సుందరమైన భావన ఆవిర్భవిస్తుంది.

ఫిదియా: బలహీనులకు బాసట వృద్ధాప్యం వల్ల శరీరం సహకరించని వారు, తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారు, లేదా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఉపవాసం ఉండటం ప్రాణాపాయం కావచ్చు. అటువంటి సందర్భాల్లో, "మీ భక్తిని నేను ఉపవాసం ద్వారానే కాకుండా, సాటి మనిషి ఆకలి తీర్చడం ద్వారా కూడా స్వీకరిస్తాను" అని దైవం అభయమిచ్చాడు. తాను ఒక పూట భోజనం మానేస్తే వచ్చే పుణ్యం, ఒక పేదవాడికి అన్నం పెట్టడం ద్వారా పొందవచ్చని చెప్పడం—సామాజిక న్యాయానికి పరాకాష్ట. ఫిదియా అనేది కేవలం ఒక పరిహారం కాదు, అది ఒక సంపన్నుడిని పేదవాడి గడప వరకు నడిపించే కరుణా వారధి.

కఫ్ఫారా: నైతిక జవాబుదారీతనం మరోవైపు, ఉద్దేశపూర్వకంగా, ఎటువంటి కారణం లేకుండా ఉపవాసాన్ని విరమిస్తే దానికి 'కఫ్ఫారా' అనే కఠినమైన ప్రాయశ్చిత్తం ఉంటుంది. వరుసగా అరవై రోజులు ఉపవాసం ఉండటం లేదా అరవై మంది నిరుపేదలకు భోజనం పెట్టడం దీని నియమం. ఇది శిక్ష కాదు, ఒక నైతిక బాధ్యత. మనం చేసిన ప్రతి తప్పుకు ఈ లోకంలోనే పరిహారం చెల్లించుకోవాలని, ఆ పరిహారం కూడా పరోక్షంగా సమాజంలోని అట్టడుగు వర్గాలకు మేలు చేసేదిగా ఉండాలని ఇస్లాం బోధిస్తుంది. మనిషి తన అహాన్ని చంపుకుని, తన తప్పును ఒప్పుకుని, సామాజిక సేవ ద్వారా తన ఆత్మను శుద్ధి చేసుకోవడమే కఫ్ఫారాలోని ఆంతర్యం.

2. అంతర్ముఖ ప్రయాణం:
ఏతెకాఫ్ అనే ఏకాంత ఆరాధన

రమజాన్ చివరి పది రోజులు రాగానే, వాతావరణంలో ఒక రకమైన గాఢత నెలకొంటుంది. ప్రపంచపు రొదను, వ్యాపార లావాదేవీలను, సోషల్ మీడియా అలజడిని పక్కన పెట్టి, అల్లాహ్ దాసులు మస్జిదులో ఒక మూలకు చేరి తనను తాను దైవానికి అంకితం ఇస్తాడు. దీనినే 'ఏతెకాఫ్' అంటారు. నిశ్శబ్దంలో నిశిత అన్వేషణ ఏతెకాఫ్ అనేది ఒక ఆధునిక 'డిజిటల్ డిటాక్స్' (Digital Detox) మాత్రమే కాదు, అది ఒక ఆత్మీయ పునరుద్ధరణ. మస్జిదు ప్రాంగణమే ఒక ఆశ్రమంగా మారిపోతుంది. అక్కడ దాసుడు కేవలం దైవంతో మాత్రమే సంభాషిస్తాడు. గడిచిన ఏడాది కాలంలో తాను చేసిన దప్పిదాలేమిటి? తన ప్రవర్తన వల్ల ఎవరైనా నొచ్చుకున్నారా? తన సంపాదనలో నిజాయితీ ఉందా? అని ప్రతి క్షణం ఆత్మపరిశీలన చేసుకుంటాడు. సాహితీ పరిమళంతో చెప్పాలంటే, ఇది 'బహిర్ముఖ చక్షువును అంతర్ముఖం' చేసుకోవడం. బయటి ప్రపంచాన్ని చూడటం మానేసి, లోపలి ప్రపంచంలో పేరుకుపోయిన ఈర్ష్య, ద్వేషం, అహంకారం అనే మాలిన్యాలను ప్రార్థన అనే జలంతో కడిగివేసుకునే అపురూప ఘట్టం ఇది. ఈ పది రోజులు గడిపి బయటకు వచ్చే దాసుడు, అప్పుడే వికసించిన పద్మంలా స్వచ్ఛంగా, ప్రశాంతంగా ఉంటాడు.

3. వెయ్యి వెలుగుల దివ్య నిశీధి: లైలతుల్ ఖదర్

రమజాన్ మాసానికి మకుటాయమానమైనది 'లైలతుల్ ఖదర్' (మహా రాత్రి). ఇది ఏ రాత్రి అనేది రహస్యం, కానీ అది రమజాన్ చివరి పది రోజుల్లోని బేసి రాత్రుల్లో దాగి ఉంటుంది. ఖుర్‌ఆన్ వాక్కుల ప్రకారం, ఈ రాత్రి వెయ్యి నెలల కంటే ఉత్తమమైనది. అనంతమైన పుణ్యాల వెల్లువ వెయ్యి నెలలు అంటే సుమారు 83 సంవత్సరాలు. అంటే ఒక సామాన్య మనిషి సగటు జీవిత కాలం. జీవితాంతం చేసే ఆరాధన కంటే, ఈ ఒక్క రాత్రి చేసే ఆరాధన మిన్న అని చెప్పడం వెనుక ఉన్న ఉద్దేశం...మనిషికి అనంతమైన ఆశను కల్పించడం. ఈ రాత్రిలో ఆకాశం నుండి జిబ్రయీల్ (అలైహిస్సలాం) నాయకత్వంలో దైవదూతల సైన్యం భూమిపైకి దిగివస్తుందని, వారు ప్రతి ఇంటా శాంతిని పంచుతారని విశ్వాసం. ప్రవక్త ముహమ్మద్ (స) ఈ రాత్రిని వెతకమని చెప్పారు. ఈ అన్వేషణలో ఒక తపన ఉంటుంది, ఒక నిరీక్షణ ఉంటుంది. ప్రియుడి కోసం ఎదురుచూసే విరహిణిలా, భక్తుడు దైవకృప కోసం రాత్రంతా జాగారం చేస్తాడు. కన్నీటితో తన పాపాలను కడిగేసుకుంటాడు. ఆ రాత్రి వేకువజాము వరకు విశ్వమంతా ఒక రకమైన దివ్య ప్రశాంతత అలుముకుంటుంది. ఇది కేవలం ఒక మతపరమైన నమ్మకం కాదు, మనిషి తనను తాను ఉన్నతీకరించుకోవడానికి దొరికిన ఒక సువర్ణావకాశం.

4. రమజాన్ అందించే జీవన పాఠాలు

రమజాన్ కేవలం ఆచారాల కలయిక కాదు, అది ఒక సంపూర్ణ జీవన వేదం. ఈ నెలలో నేర్చుకునే పాఠాలు ఏడాది పొడవునా మనల్ని నడిపిస్తాయి.

సహనం (సబ్ర్): ఆకలి వేస్తున్నా ఎదురుగా ఉన్న ఆహారాన్ని ముట్టుకోకపోవడం, కోపం వస్తున్నా నిగ్రహించుకోవడం... మనిషికి ఓర్పును నేర్పిస్తాయి.

సమానత్వం: మసీదులో ప్రార్థన చేసేటప్పుడు రాజు, పేద పక్క పక్కనే నిలబడతారు. అందరూ ఒకే సమయానికి తింటారు, ఒకేలా ప్రార్థిస్తారు. ఇది సమానత్వానికి ప్రతీక.

దానగుణం: జకాత్ (దానం) ద్వారా సంపదను పంచుకోవాలని రమజాన్ గుర్తు చేస్తుంది. సంపద అనేది కేవలం మనది కాదు, అందులో నిరుపేదల వాటా కూడా ఉందని భావించడం గొప్ప సామాజిక స్పృహ.

5. హృదయ స్పందన: ప్రత్యేక ప్రార్థనల మాధుర్యం

లైలతుల్ ఖదర్ రాత్రిలో ప్రవక్త నేర్పిన దువా ఎంతో హృద్యమైనది:

"అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ అఫ్వ ఫఅఫు అన్నీ".

దీని అర్థం: "ఓ అల్లాహ్! నీవు క్షమించేవాడివి, క్షమించడాన్ని ప్రేమిస్తావు, కాబట్టి నన్ను క్షమించు."

ఇందులో ఎంతటి వినమ్రత ఉందో గమనించండి. మనిషి తన తప్పులను ఒప్పుకోవడంలోనే గొప్పతనం ఉందని, క్షమించడమే దైవగుణమని ఈ వాక్యం మనకు బోధిస్తుంది. రమజాన్ నెల ముగిసే సమయానికి ప్రతి ముస్లిమ్ హృదయం ఈ భావనతో పునీతమవుతుంది.

రమజాన్ అనేది ఒక నెల రోజుల ప్రయాణం కాదు, అది జీవితకాలపు మార్పుకు పునాది. ఫిదియా ద్వారా పరుల బాధను పంచుకోవడం, ఏతెకాఫ్ ద్వారా తనను తాను గెలుచుకోవడం, లైలతుల్ ఖదర్ ద్వారా దైవ సాన్నిధ్యాన్ని ముద్దాడటం...ఈ మూడూ మనిషిని పరిపూర్ణుడిని చేస్తాయి.

ప్రకృతిలో శీతాకాలం తర్వాత వసంతం వచ్చి చెట్లు చిగురించినట్లు, రమజాన్ తర్వాత మనిషిలో మానవత్వం చిగురించాలి. అప్పుడే ఆ మాసం యొక్క పరమార్థం నెరవేరుతుంది. ఈ పవిత్ర మాసం ముగిసేసరికి, మనిషిలోని స్వార్థం అంతమై, నిస్వార్థం వెల్లివిరిసి, లోకమంతా శాంతి, సౌభ్రాతృత్వంతో విలసిల్లాలి. ఇదే రమజాన్ ఇచ్చే సందేశం, ఇదే రమజాన్ అందించే శాశ్వత సౌరభం.

(వ్యాసకర్త ఆధ్యాత్మిక రచయిత, జర్నలిస్టు)

ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 13.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 352 పేజీలు:12 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



రాహుల్ ద్రవిడ్‌కు జీవిత సాఫల్య పురస్కారం 12





నిరంతర పోరాటం.. ప్రజలతో మమేకం

- ప్రజాక్షేత్రంలో ఉంటూ.. ప్రజా సమస్యలపై గళమెత్తుతూ
- ఉద్యమ కార్యాచరణతో ప్రజాక్షేత్రంలోకి కల్వకుంట్ల కవిత
- తెలంగాణ రాజకీయాల్లో కొత్త రాజకీయ శక్తిగా రాక
- అవాంతరాలను ఎదుర్కొంటూ ముందుకు
- సామాజిక, సాంస్కృతిక రంగాల్లో 'జాగృతి' విశేష సేవలు
- తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ, సామాజిక న్యాయమే లక్ష్యం
- కొత్త పార్టీ ఏర్పాటు దిశగా కవిత అడుగులు

చిటుకుల మైసారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 12: తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కొత్త శక్తిగా కల్వకుంట్ల కవిత ఎదుగుతన్నారు. తెలంగాణ ఉద్యమ ఆత్మను, అమరుల త్యాగాలను, ప్రజల ఆకాంక్షలను మళ్లీ ముందుకు తీసుకువెళ్లేలా తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రజలతో మమేకం అవుతున్నారు. ఒక కొత్త రాజకీయ శక్తి రూపుదిద్దుకుంటుందనే సంకేతాలు స్పష్టంగా ఇస్తూ.. రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రజాక్షేత్రంలో ఉంటూ, ప్రజా సమస్యలపై గళమెత్తుతున్నారు. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ, ఉద్యమ వారసత్వ పరిరక్షణ, సామాజిక న్యాయం అనే లక్ష్యాలతో విప్లవాత్మక పంథాలో కొత్త రాజకీయ కార్యాచరణతో ప్రజల ముందుకు రావాలని కవిత నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఆమె కొత్త పార్టీ పెడుతున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. తెలంగాణ ప్రజల హక్కులు, మహిళల గౌరవం, యువత భవిష్యత్, రైతుల సంక్షేమం, దళిత-గిరిజన వర్గాల అభ్యున్నతి వంటి అంశాలను ప్రధాన అజెండాగా ముందుకు సాగాలని ఆమె ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మే నెలలోనే కొత్త పార్టీ ప్రకటన ఉండొచ్చని ఇప్పటికే

...:: మిగతా 4లో

జనంలో 'జాగృతి'

గత రెండు దశాబ్దాలుగా తెలంగాణ జాగృతి సంస్థ ద్వారా కవిత సామాజిక, సాంస్కృతిక రంగాల్లో విశేష సేవలు అందిస్తున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేయడంలో జాగృతి కీలక పాత్ర పోషించింది. విదేశాల్లోనూ బతుకమ్మను నిర్వహించి తెలంగాణ సంస్కృతిని అంతర్జాతీయ వేదికలపై నిలబెట్టారు కవిత. సామాజిక సమస్యలపై కూడా ఆమె నిరంతరం పోరాటం కొనసాగిస్తున్నారు. మహిళా హక్కులు, మహిళల ఆత్మగౌరవం కోసం జాగృతి ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. మహిళా రిజర్వేషన్ అమలుకు ఆమె దేశవ్యాప్తంగా పోరాటం చేశారు. అదే విధంగా బీసీ రిజర్వేషన్ల పెంపు, దళిత-గిరిజన హక్కులు, రైతుల సమస్యలు, బీడీ కార్మికుల సంక్షేమం, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, నిరుద్యోగ యువత సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తూ ప్రజల మధ్యనే ఉంటున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.31 (శుక్రవారం సాయంత్రం)

సహర్ – 5.03 (శనివారం ఉదయం)



ఇంధన భద్రతపై భారత ప్రభుత్వం రాజీ

ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర సర్కారుపై రాహుల్‌గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. గురువారం లోక్‌సభలో మాట్లాడిన ఆయన.. ఇంధన భద్రత విషయంలో భారత ప్రభుత్వం అమెరికాతో రాజీపడిందని ఆరోపించారు.

11

వంటగ్యాస్ కోసం 'క్యూ'

- మండే ఎండలో గంటల తరబడి నిరీక్షణ
- గ్యాస్‌ఏజెన్సీల వద్ద నెలకొన్న రద్దీ
- మండి పడుతున్న వినియోగదారులు
- సిలిండర్ల కొరత వాస్తవమే: మంత్రి ఉత్తమ్
- కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే గ్యాస్ కొరత: మంత్రి పొన్నం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 12: వంటగ్యాస్ సిలిండర్ల కొరతతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక ప్రాంతాల్లో సిలిండర్ల సరఫరా ఆలస్యం కావడంతో డిస్ట్రిబ్యూటర్ల కార్యాలయాల ఎదుట వినియోగదారులు క్యూలైన్లలో నిలబడాల్సి వస్తోంది. మండుతున్న ఎండను లెక్కచేయకుండా గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడటంతో మహిళలు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసేందుకు ప్రయత్నించినా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. బుకింగ్ పూర్తికాకపోవడంతో చాలామంది నేరుగా గ్యాస్ ఏజెన్సీలకు వెళ్లి నిలబడాల్సి వస్తోంది. సిలిండర్ బుకింగ్ కోసం ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ సేవలు అనేక చోట్లసరిగా పనిచేయడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా బుకింగ్ చేయడానికి ప్రయత్నించినా సర్వర్ సమస్యలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీలకు ఫోన్ చేసినా స్పందన లేదని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు డీలర్లు ఫోన్లు ఎత్తకపోవడం లేదా

...:: మిగతా 4లో





మానవత్వంతో కూడిన వైద్యం కావాలి

యాంత్రికంగా ఉండొద్దు.. ఫార్మా ఉత్పత్తుల్లో 40% హైదరాబాద్ నుంచే

- జీనోమ్ వ్యాలీ నుంచే కరోనా వ్యాక్సిన్ల ఉత్పత్తి
- ఇది రాష్ట్రానికి ఎంతో గర్వకారణం
- క్యాన్సర్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు
- రాష్ట్రంలో విద్యా విధానంలో మార్పులు
- నైపుణ్యాభివృద్ధికి స్కిల్స్ యూనివర్సిటీ
- మెడికవర్ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 12: యాంత్రికంగా కాకుండా మానవత్వంతో కూడిన సేవలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మెడికవర్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, దేశవ్యాప్తంగా మెడికవర్ హాస్పిటల్స్‌కు మంచి గుర్తింపు ఉందని పేర్కొన్నారు. రోగుల పట్ల సేవాభావం పెంచుకుంటేనే వైద్య రంగం పట్ల ప్రజల్లో విశ్వాసం మరింత

...:: మిగతా 4లో

హైదరాబాద్‌కు రండి..

- ఫ్యూచర్ సిటీలో స్థలం కేటాయిస్తాం
- నెట్‌ఫ్లిక్స్ వచ్చిందంటే హాలీవుడ్‌వచ్చినట్లే
- నంబర్ వన్ బ్రాడ్‌కాస్టర్‌గా నెట్‌ఫ్లిక్స్
- నెట్‌ఫ్లిక్స్‌ఐలెన్ స్టూడియోను ప్రారంభించిన సీఎం రేవంత్

...:: 4లో



ఎన్నికల కమిషనర్ అభిశంసన

ఎస్ఐఆర్, ఓట్ చోరీ విషయంలో అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్న జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నకాంగ్రెస్, ఇతర ప్రతిపక్షపార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఇందుకు 193 మంది ఎంపీలు సంతకాలు చేశారు.

11



హర్మూజ్‌మూసివేత కొనసాగుతుంది

- అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటాం
- యుద్ధంలో నష్టపోయిన ప్రజలకు పరిహారం
- ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ
- యుద్ధం ముగింపునకు ఇరాన్3 షరతులు
- శత్రుదేశాలపై ఇరాన్ క్షిపణుల దాడి
- ఇరాన్‌ను అడ్డుకోవడమే మాకు ముఖ్యం: ట్రంప్
- హర్మూజ్‌లో భారత నౌకలకు ఇరాన్ అనుమతి

...:: 4లో

పార్టీ ఫిరాయింపుల కేసులో

విచారణ ముగించిన సుప్రీంకోర్టు



- బీఆర్ఎస్‌కు షాక్.. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ఊరట
- ఇప్పటికే పిటిషన్లను స్పీకర్ పరిష్కరించారు
- కోర్టుకు తెలిపిన న్యాయవాది సింఘ్వీ

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, మార్చి 12: బీఆర్ఎస్‌ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల కేసులో సుప్రీంకోర్టు విచారణ ముగించింది. బీఆర్ఎస్ పిటిషన్లపై విచారణ ముగిసినట్లు ధర్మాసనం ప్రకటించింది. ఇప్పటికే పిటిషన్లను స్పీకర్ పరిష్కరించినట్టు న్యాయవాది సింఘ్వీ తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిర్ణయం వెలువరించారన్న సింఘ్వీ, పెండింగ్‌లో ఉన్న ఇద్దరిపై బుధవారం తుది తీర్పు ఇచ్చినట్టు తెలిపారు. సుప్రీంకోర్టులో ఇంకా విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. స్పీకర్ న్యాయవాది సింఘ్వీ వాదనతో సుప్రీం కోర్టు ధర్మాసనం ఏకీభవించింది. 2 రోజుల్లో స్పీకర్ తన తీర్పు కాపీలు ఫిర్యాదుదారులకు ఇవ్వాలని పేర్కొంది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల కేసులో విచారణ ముగిసినట్లు జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం ప్రకటించింది. రాష్ట్ర రాజకీయాల్లో కొన్నిరోజులుగా సంచలనం సృష్టించిన ఈ కేసు విచారణను గురువారం సుప్రీంకోర్టు ముగించింది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పినా, స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ గురువారం విచారణకు రాగా విచారణ కొనసాగించాల్సిన అవసరం

...:: మిగతా 4లో

తెలంగాణకు కొత్త పోలీస్‌బాస్

తదుపరి డీజీపీగా సీవీ ఆనంద్?



- డీజీపీ నియామక ప్రక్రియలో కీలక ఘట్టం పూర్తి
- ముగ్గురి పేర్లు ఖరారు చేసిన యూపీఎస్సీ
- జాబితాలో సీవీ ఆనంద్, సౌమ్య మిశ్రా, ప్రభాకర్ ఆప్టే

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 12: తెలంగాణ రాష్ట్రానికి కొత్త పోలీస్ బాస్ రానున్నారు. డీజీపీ నియామక ప్రక్రియలో కీలక ఘట్టం పూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వం పంపించిన పేర్లలో నుంచి ముగ్గురిని యూపీఎస్సీ ఖరారు చేసింది. కొత్త డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ నియమితులు అయ్యే అవకాశం ఉందని

...:: మిగతా 4లో







నేనెప్పుడు నియమాలను ఉల్లంఘించలేదు

దేశంలోని 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమే లోక్‌సభ అని స్పీకర్ ఓం బిర్లా అన్నారు. ప్రతిపక్ష సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానం నిన్నటి సభలో వీగిపోయిన నేపథ్యంలో, గురువారం ఓం బిర్లా లోక్‌సభకు హాజరయ్యారు.

11

రాజకీయం

నిరంతర పోరాటం.. ప్రజలతో మమేకం

మొదటిపేజీ తరువాయి

సంకేతాలు ఇచ్చారు.

వెలుగుమట్ల బాధితులకు మద్దతుగా..

ఇటీవల ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇండ్లు కూల్చివేతకు గురైన బాధితుల తరపున కవిత చేపట్టిన నిరవధిక దీక్ష రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇండ్లు కూల్చిన చోటే వారికి మళ్లీ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ఆమె డిమాండ్ చేస్తూ చేసిన పోరాటం ఫలితంగా ప్రభుత్వం స్పందించక తప్పలేదు. చివరకు బాధితులకు పట్టాలు పంపిణీ చేసి ఇండ్లు కట్టిస్తామని ప్రభుత్వ మంత్రులు హామీ ఇవ్వడం చకచకా జరిగిపోయాయి. అదే సమయంలో అమర వీరులు, తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని కవిత ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్‌చేశారు. ఈ నేపథ్యంలో అమరుల కుటుంబాలకు న్యాయం చేస్తామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించడం గమనార్హం.

ఎన్ని ఇబ్బందులు ఎదురైనా..

ఇదిలా ఉండగా, ఢిల్లీ లిక్కర్ కేసులో కవితను లక్ష్యంగా చేసుకుని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయంగా ఇబ్బందులు సృష్టించిందనేది చాలామంది అభిప్రాయపడ్డారు. ఆ కేసు నేపథ్యంలో కవిత దాదాపు ఐదున్నర నెలలు జైలులో గడపాల్సి వచ్చింది. అయితే ఆ కాలం ఆమెకు రాజకీయంగా మరింత దృఢ సంకల్పాన్ని ఇచ్చిందని విశ్లేషకులు చెబుతున్నారు. చివరకు ఢిల్లీ రౌస్‌అవెన్యూ కోర్టు తీర్పుతో ఆమెకు ఊరట లభించింది. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్ లక్షణాలు కవితలో కనిపిస్తున్నాయని ఆమె అనుచరులు చెబుతున్నారు. ఉద్యమ స్ఫూర్తి, రాజకీయ పట్టుదల, ప్రజా సమస్యలపై నిలదీసే ధైర్యం ఆమె రాజకీయ ప్రయాణాన్ని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయని చెబుతున్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా వెనక్కి తగ్గకుండా తన రాజకీయ లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకుని కవిత ముందుకు సాగుతున్నారనేది వాస్తవం.

వంటగ్యాస్ కోసం 'క్యూ'

మొదటిపేజీ తరువాయి



స్విచ్ ఆఫ్‌లో ఉంచడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ కొరత సమస్యను వెంటనే పరిష్కరించి సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సిలిండర్ల కొరత వాస్తవమే: మంత్రి ఉత్తమ్

రాష్ట్రంలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 శాతం మాత్రమే కమర్షియల్ అని వివరించారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని తమ శాఖ అధికారులు వెల్లడించారని చెప్పారు. కానీ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది వాస్తవమని తెలిపారు. రాష్ట్రంలో వంట గ్యాస్ తాజా పరిస్థితిపై చర్చించేందుకే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షిస్తామని మంత్రి ఉత్తమ్ వివరించారు. రాష్ట్రంలో రోజూ ఎన్ని కమర్షియల్ సిలిండర్లు అవసరం, సరఫరా ఏ మేరకు ఉంది, గ్యాస్ కొరతకు గల కారణాలు, అందుకు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రత్యామ్నాయాలపైదృష్టి పెట్టేందుకున్న మార్గాలన్నింటిపై చర్చించనున్నట్లు మంత్రి ఉత్తమ్ వివరించారు.

కేంద్ర ప్రభుత్వ విధానాల
వల్లే గ్యాస్ కొరత: మంత్రి పొన్నం

కేంద్ర ప్రభుత్వం విధానాల వల్లే గ్యాస్‌సిలిండర్ల కొరత ఏర్పడిందని మంత్రి పొన్నం ప్రభాకర్‌అన్నారు. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా, దేశానికి గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడి వంటగ్యాస్, కమర్షియల్ సిలిండర్ల కొరత తీవ్రమైందని అన్నారు. ఈ సంక్షోభం వల్ల హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడుతుండగా, సామాన్యులు గ్యాస్ బుకింగ్స్, డెలివరీలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనితో వంట కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన పరిస్థితి ఏర్పడిందని మంత్రి అన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. రాష్ట్రం నుండి 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా రాష్ట్రానికి సరిపడ గ్యాస్ తీసుకురాలేకపోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. గతంలో ఉక్రెయిన్ రష్యా యుద్ధాన్ని ఆపమని చెప్పిన నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇప్పుడెందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ప్రశ్నించారు. గ్యాస్ తో పాటు భవిష్యత్తులో ఎరువుల కొరత సంభవించే అవకాశం ఉందని వ్యవసాయ రంగ నిపుణులు శాస్త్రవేత్తలు చెబుతున్నారని. తక్షణమే కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగాలి గ్యాస్ కొరత నివారించాలని, ఎరువుల కొరత రాకుండా చూసుకోవాలని మంత్రి పొన్నం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటోందని ఆయన చెప్పారు.

పార్టీ ఫిరాయింపుల కేసులో

విచారణ ముగించిన సుప్రీంకోర్టు

మొదటిపేజీ తరువాయి

లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. తమ పార్టీకి చెందిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఫిరాయింపు నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, చింత ప్రభాకర్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కేపీ వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ పిటిషన్లపై సుదీర్ఘ విచారణ అనంతరం గురువారం నాడు ఉన్నత న్యాయస్థానం తుది తీర్పు వెలువరించింది. ఈ కేసును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించగా.. స్పీకర్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు.

తెలంగాణకు కొత్త పోలీస్‌బాస్

మొదటిపేజీ తరువాయి

తెలుస్తోంది. యూపీఎస్సీ ఎంప్యానల్‌కు సీవీ ఆనంద్, శిఖా గోయల్, సౌమ్య మిశ్రా, వినాయక్ ప్రభాకర్ ఆప్టే పేర్లతో ఒక జాబితాను ప్రభుత్వం పంపించింది. యూపీఎస్సీ ఎంప్యానల్ కమిటీ సీవీ ఆనంద్, సౌమ్య మిశ్రా, వినాయక్ ప్రభాకర్ ఆప్టే పేర్లను సూచించినట్లు సమాచారం. ఈ ముగ్గురిలో ఒకరిని రాష్ట్ర ప్రభుత్వం డీజీపీగా నియమించనుంది.

సీనియార్టీకి ప్రాధాన్యం?

కేడర్ పరంగా ఈ ముగ్గురిలో సీవీ ఆనంద్ అత్యంత సీనియర్. రాష్ట్రంలో ఏఎస్పీ నుంచి మొదలుకొని డీజీపీ హోదా వరకు పలు స్థానాల్లో సుదీర్ఘ కాలం పనిచేశారు. ఇంతకు ముందు ఆయన హైదరాబాద్ సీపీగానూ చేశారు. ఆ సమయంలో సినిమా పైరసీ చేస్తున్న ముఠాను పట్టుకున్నారు. మరోవైపు ఐబీలో సుదీర్ఘకాలం పనిచేసిన అనుభవం కలిగిన ఆప్టే గత సెప్టెంబర్‌లో స్పెషల్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఐబీలోనే ఆయన మరింత ఉన్నత హోదాకు చేరుకునే అవకాశం ఉండడంతో ఆయన తెలంగాణ కేడర్‌లోకి తిరిగి వచ్చే అవకాశం ప్రస్తుతానికి లేనట్లే కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో సీవీ ఆనంద్ సీనియారిటీతో పాటు ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఆయన్నే పూర్తికాలపు డీజీపీగా నియమించేందుకు ప్రభుత్వం మొగ్గు చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత ఇంఛార్జి డీజీపీ శివధర్ రెడ్డి ఏప్రిల్ నెలాఖరుతో పదవీ విరమణ పొందనున్నారు. అనంతరం తదుపరి డీజీపీని నియమించనున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఇప్పటి వరకు ఆరుగురు డీజీపీగా పనిచేసినా, పూర్తి కాలపు డీజీపీలుగా ఇద్దరే పనిచేశారు. తెలంగాణ తొలి డీజీపీగా పనిచేసిన అనురాగ్‌శర్మ తొలుత తాత్కాలిక డీజీపీగా పని చేసినా తర్వాత యూపీఎస్సీ ద్వారా 2015 నవంబర్ 13న పూర్తికాలపు డీజీపీగా నియమితులయ్యారు. 2017 నవంబర్ 12 వరకు ఆయన కొనసాగిన అనంతరం తాత్కాలిక డీజీపీగా మహేందర్ రెడ్డి ఆ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన సైతం యూపీఎస్సీ ద్వారా పూర్తికాలపు డీజీపీగా నియమితులై, 2022 డిసెంబర్ వరకు పనిచేశారు. వీరిద్దరి తర్వాత పనిచేసిన అంజనీకుమార్, రవిగుప్తా, జితేందర్‌తో పాటు ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి తాత్కాలిక ప్రాతిపదికనే డీజీపీలుగా వ్యవహరించారు. తాజాగా నియమితులు కానున్న డీజీపీ తెలంగాణకు మూడో పూర్తి కాలపు డీజీపీగా ఉండనున్నారు. మరి రాష్ట్ర నూతన డీజీపీగా ఎవరు ఎంపికవుతారనేది ఎదురు చూడాల్సిందే.

మానవత్వంతో కూడిన వైద్యం కావాలి

మొదటిపేజీ తరువాయి

బలపడుతుందని అన్నారు. గురువారం సాయంత్రం కోకాపేటలో కోకాపేట్ లో మెడికవర్ హాస్పిటల్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న ఫార్మా ఉత్పత్తుల్లో సుమారు 40 శాతం హైదరాబాద్ నుంచే వస్తున్నాయని సీఎం తెలిపారు. కరోనా కాలంలో తయారైన మూడు ప్రధాన వ్యాక్సిన్లు జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి కావడం రాష్ట్రానికి గర్వకారణమని చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రులు నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి, పీవీ నరసింహారావు తీసుకొచ్చిన సరళీకరణ విధానాలు పునాది వేశాయని సీఎం గుర్తుచేశారు. ఆ తర్వాత చంద్రబాబు నాయుడు హైటెక్ సిటీ నిర్మాణాన్ని పూర్తి చేసి నగరాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దారని అన్నారు.

విద్యా రంగంలో పెద్ద మార్పులు

నాణ్యమైన విద్య అందించాలన్న లక్ష్యంతో రాష్ట్రంలో విద్యా విధానంలో మార్పులు తీసుకొస్తున్నామని సీఎం వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, భోజనం, రవాణా సదుపాయం కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా లేదా 50 శాతం రాయితీతో ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం అందిస్తామని వివరించారు.

నైపుణ్యాభివృద్ధికి స్కిల్స్ యూనివర్సిటీ

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేకంగా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని సీఎం తెలిపారు. విద్యను అందిస్తే సంక్షేమ పథకాల అవసరం తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని సీఎం అన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం బాగుంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే 65 లక్షల మంది ఆరోగ్య వివరాలతో హెల్త్ డేటా రూపొందిస్తున్నామని తెలిపారు. వారికి డిజిటల్ హెల్త్ కార్డులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. 20 ఏళ్ల ఆరోగ్యశ్రీ డేటాను కూడా ఈ ప్రక్రియలో వినియోగిస్తున్నామని చెప్పారు.

క్యాన్సర్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

క్యాన్సర్ నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయను ప్రభుత్వ సలహాదారుడిగా నియమించామని చెప్పారు. ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ఇప్పటికే రూ.1800 కోట్లు ఖర్చు చేశామని సీఎం తెలిపారు. ఉస్మానియా, టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణం మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం వైద్య ఖర్చులు సామాన్యులకు భరించలేని స్థాయికి పెరిగిపోయాయని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న వైద్యులు ఏడాదికి కనీసం ఒక నెల ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు అందించాలని సూచించారు. రాష్ట్రంలోని కోటి ముప్పై లక్షల కుటుంబాలకు జీవిత బీమా అందించేలా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సీఎం వెల్లడించారు.

హైదరాబాద్‌కు రండి.. ఫ్యూచర్ సిటీలో స్థలం కేటాయిస్తాం

- నెట్‌ఫ్లిక్స్ వచ్చిందంటే హాలీవుడ్‌వచ్చినట్లే
- నంబర్ వన్ బ్రాడ్‌కాస్టర్‌గా నెట్‌ఫ్లిక్స్
- గ్లోబల్‌సిటీగా ఎదిగిన హైదరాబాద్
- నెట్‌ఫ్లిక్స్‌ఐలైన్ స్టూడియోను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 12: నెట్‌ఫ్లిక్స్ సంస్థను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. చాలా మంది ఇలాంటి స్టూడియో కోసం వెయిట్ చేస్తున్నారన్న ఆయన ప్రపంచవ్యాప్తంగా మంచి ప్రతిభను నెటిఫ్లిక్స్‌వెలికితీస్తుందని కితాబిచ్చారు. హైదరాబాద్, నెట్‌ఫ్లిక్స్‌కు దగ్గరి పోలికలు ఉన్నాయని చెప్పారు. నెట్‌ఫ్లిక్స్ టాలెంట్ ఉన్న వాళ్లకు గొప్ప అవకాశాలు కల్పిస్తుందని, ఇప్పుడు గ్లోబల్ సిటీగా హైదరాబాద్ ఎదిగిందని అన్నారు. నెట్ ఫ్లిక్స్‌ఐలైన్ స్టూడియోను గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు, తెలుగు అగ్రనటుడు రానాతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐలైన్ స్టూడియోస్ ప్రతినిధులు కూడా ఉన్నారు.

నంబర్ వన్ బ్రాడ్‌కాస్టర్‌గా నెట్‌ఫ్లిక్స్

తెలంగాణ రాష్ట్రప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని నెట్‌ఫ్లిక్స్ కూడా ఆ దిశగా దృష్టి పెట్టినట్లు ఒకసారి ఆర్టికల్ చదివానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నెట్‌ఫ్లిక్స్‌భవిష్యత్తులో స్పోర్ట్స్‌విభాగంలో నంబర్ వన్ బ్రాడ్‌కాస్టర్‌గా ఎదుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని భరోసాను ఇచ్చారు. సినిమాలపై తనకు ప్రత్యేక ఆసక్తి ఉందని, మూవీస్ చూడటం తనకు చాలా ఇష్టమని సీఎం అన్నారు. ఫ్యూచర్ సిటిలో నెట్‌ఫ్లిక్స్ కార్యాలయం పెట్టుకుంటామంటే స్థలం కేటాయిస్తామని, నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ కంపెనీని కూడా అక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు.

నాకల సాకారం కాబోతోంది

"హైదరాబాద్ నగరం ముఖ్యంగా సినిమా చిత్ర పరిశ్రమ ఈస్థాయిలో ప్రపంచాన్ని ఆకర్షిస్తోంది. సినిమాపరిశ్రమను ఆనాడు చెన్నై నుంచి ఇక్కడికి రావడానికి ఎన్టీఆర్, ఏఎన్నార్, రామానాయుడు స్టూడియోలు ఏర్పాటు చేయడంకో సాకారమైంది. ప్రపంచ స్థాయి టాలెంట్‌ను ఇక్కడ ప్రదర్శించడానికి అవకాశం కల్పించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈరోజు హైదరాబాద్కు నెట్ ఫ్లిక్స్‌వచ్చిందంటే హాలీవుడ్‌వచ్చినట్లే. ఇది నా కలకు ముందు అడుగుగా భావిస్తున్నానన్నారు. ఈ విషయాన్నే నా మిత్రులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నో సార్లు చెప్పి ఉంటా. ఇదేదో కేవలం టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ కాదు. ప్రస్తుతం ఫోకస్ అంతా హాలీవుడ్ పైనే. అని తెలిపారు. నెట్ ఫ్లిక్స్ హైదరాబాద్‌లో ఉందని చెప్పడానికి నేను గర్వంగా ఫీలవుతున్నాని, నేను అధికారికంగానే చెబుతున్న హాలీవుడ్ ఇక్కడ ఉంది. నాకల త్వరలోనే సాకారం కాబోతుందని సీఎం తెలిపారు. నెట్ ఫ్లిక్స్, ఐలైన్ సీఈవో జెఫ్‌ను సంతోషంగా హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నా అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

ఏవీజీసీ గ్లోబల్ లీడర్ గా
హైదరాబాద్: మంత్రి శ్రీధర్ బాబు

యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ) రంగంలో హైదరాబాద్‌ను గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఓ వైపు అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూనే మరోవైపు స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్ పై దృష్టి సారించిందన్నారు. గురువారం హైటెక్ సిటీలో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్ ఫ్లిక్స్ కు చెందిన ఐలైన్ స్టూడియోను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ హైదరాబాద్‌కు నెట్ ఫ్లిక్స్ రాకతో సినిమా స్టోరీ టెల్లింగ్ లో 'తెలంగాణ' బ్రాండ్ మరింత విశ్వవ్యాప్త మవుతుందన్నారు. గ్లోబల్ ప్రొడక్షన్ పైప్‌లైన్‌లో నగరం ఓ నిర్ణయాత్మక కేంద్రంగా మారుతుందన్నారు.

హర్మూజ్ మూసివేత కొనసాగుతుంది

ప్రతిపక్షం నేషనల్ డెస్క్



హర్మూజ్‌మూసివేత కొనసాగుతుందని, అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటామని, యుద్ధంలో నష్టపోయిన ప్రజలకు పరిహారం అందిస్తామని ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌మొజ్తబా ఖమేనీ సంచలన ప్రకటన చేశారు. "ఇరాన్ పౌరుల రక్తం చిందించిన వారిపై ప్రతీకారం తీర్చుకోవడానికి మేము వెనుకాడం" అని పేర్కొన్నారు. పశ్చిమాసియా ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలన్నింటినీ తక్షణమే మూసివేయాలని, లేకుంటే వాటిపై దాడులు చేస్తామని హెచ్చరించారు. ఇరాన్‌అమెరికా, ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు తీవ్రమవుతున్న తరుణంలో, ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్లో మొజ్తబా ఖమేనీ సందేశాన్ని చదివి వినిపించారు. మొజ్తబా ఖమేనీ ప్రాంతీయ భద్రత గురించి ప్రస్తావిస్తూ, అమెరికా తన సైనిక స్థావరాలను మూసివేయాలని, లేకుంటే ఇరాన్ వాటిని లక్ష్యంగా చేసుకుంటుందని ఘాటుగా హెచ్చరికలు చేశారు. ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిపై మొజ్తబా తన వైఖరిని స్పష్టం చేశారు. పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లను కలిపే ఈ జల సంధి ద్వారానే ప్రపంచ చమురు రవాణాలో ఎక్కువ శాతం జరుగుతుంది. కనుక ఈ వ్యూహాత్మక మార్గాన్ని మూసివేయడాన్ని ఒక బలమైన అస్త్రంగా ఇరాన్ ఉపయోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

స్నేహపూర్వక సంబంధాలను ఇరాన్ కొనసాగిస్తుంది

అదే సమయంలో పొరుగు దేశాలతో ఇరాన్ సహకార ధోరణితో ఉంటుందని మొజ్తబా ఖమేనీ పేర్కొన్నారు. ప్రాంతీయ దేశాలతో స్నేహపూర్వక సంబంధాలను ఇరాన్ కొనసాగిస్తుందని అన్నారు. అయితే అవి అమెరికా దళాలకు ఆశ్రయం కల్పించకూడదని హెచ్చరించారు. యుద్ధంలో గాయపడిన వారికి ఉచితంగా చికిత్స అందించడంతో పాటు, నష్టపోయిన ప్రజలకు పరిహారం ఇస్తామని మొజ్తబా ఖమేనీ తెలిపారు. యెమెన్, ఇరాక్‌లోని సాయుధ దళాలు ఇరాన్‌కు మద్దతు తెలుపుతున్నాయని చెప్పారు. తమ అమరవీరులు చిందించిన రక్తానికి ప్రతీకారం తీర్చుకుంటామని మొజ్తబా తెలిపారు. యుద్ధంలో పోరాడుతున్న తమ సైనికులను మొజ్తబా అభినందించారు. నలువైపుల నుంచి శత్రువులు దాడులు చేస్తున్నా, సైనికులు అద్భుతంగా పోరాడుతున్నారని కొనియాడారు.

యుద్ధం ముగింపునకు ఇరాన్3 షరతులు

అమెరికా, ఇజ్రాయెల్ లతో జరుగుతున్న యుద్ధాన్ని ముగించడానికి ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ మూడు షరతులు విధించారు. ఇరాన్ చట్టబద్ధమైన హక్కులను గుర్తించడం, యుద్ధ నష్టపరిహారం చెల్లించడం, భవిష్యత్తులో ఎలాంటి దురాక్రమణలు జరగవని అంతర్జాతీయ హామీలు ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రాంతీయ శాంతి పట్ల ఇరాన్ తన నిబద్ధతను చాటుకుందని పెజెష్కియాన్ పేర్కొన్నారు. పొరుగు దేశాలతో ఘర్షణ కోరుకోవడం లేదని, తమ భూభాగంపై దాడులు చేయడానికి ఉపయోగించే స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఇరాన్‌పై జరుగుతున్న బలవంతపు యుద్ధం, సైనిక దురాక్రమణ సమస్యలను అంతర్జాతీయ సమాజం పరిష్కరించకపోతే ప్రపంచ భద్రత అస్థిరంగా మారుతుందని పెజెష్కియాన్ హెచ్చరించారు. మరోవైపు హర్మూజ్ జలసంధి గురించి కూడా ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించాలనుకునే నౌక ఇరాన్ ఆమోదం పొందాలని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషన్ గార్డ్స్ కార్ప్స్ నావల్ ఫోర్స్ కమాండర్ రియర్ అడ్మిరల్ అలిరెజా టాంగ్సిరి తెలిపారు.

శత్రుదేశాలపై ఇరాన్ క్షిపణుల దాడి

మరోవైపు, శత్రుదేశాల్లోని పలు ప్రాంతాలపై నిర్ణయాత్మక దాడులను ప్రారంభించామని ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ తెలిపింది. ఈ క్రమంలో ఖాదర్, ఎమాద్, ఖైబార్ షెకాన్, ఫట్టా వంటి క్షిపణులను ప్రయోగించామని పేర్కొంది. లెబనాన్‌లోని హెజ్ బొల్లాతో కలిసి సంయుక్తంగా ఈ దాడులు చేపట్టినట్లు స్పష్టం చేసింది. జియోనిస్ట్ (ఇజ్రాయెల్) మీడియా వర్గాలు ధ్రువీకరించినట్లుగా గత 24 గంటల్లో ఇజ్రాయెల్ పై క్షిపణుల దాడులు గణనీయంగా పెరిగాయని వెల్లడించింది. దీంతో ఇజ్రాయెల్‌లో చాలా మంది ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ జోర్డాన్‌లోని అల్ అజ్రాక్, సౌదీ అరేబియాలోని అల్ ఖార్జ్ ప్రాంతాల్లో అమెరికా స్థావరాలపై విరుచుకుపడ్డాయి.

ఇరాన్‌ను అడ్డుకోవడమే మాకు ముఖ్యం: డొనాల్డ్ ట్రంప్

ఇంధన సంక్షోభంతో ప్రపంచం అల్లాడుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక కామెంట్స్ చేశారు. పెరుగుతున్న చమురు ధరలు కంటే ఇరాన్‌ను అడ్డుకోవడమే తమ మొదటి ప్రాధాన్యత స్పష్టం చేశారు. తన 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ స్పందించారు. "ప్రపంచంలోనే అమెరికా అతిపెద్ద చమురు ఉత్పత్తిదారు అని అందరికీ తెలిసిందే. కాబట్టి చమురు ధరలు పెరిగినప్పుడు దేశానికి ఆర్థికంగా లాభం. అయితే, ఒక అధ్యక్షుడిగా నాకు అంతకంటే అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే ఒక 'దుష్ట సామ్రాజ్యం' అయిన ఇరాన్‌ను అణ్వాయుధాలు పొందకుండా అడ్డుకోవడం. తద్వారా పశ్చిమాసియాను, ఈ ప్రపంచాన్ని నాశనం కాకుండా కాపాడటం ముఖ్యం. ఆ ముప్పును నివారించడానికి నేను ఎంతటి కఠిన నిర్ణయానికైనా సిద్ధం" అని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

అమెరికాలో రాజకీయ దుమారం

ఇరాన్‌తో యుద్ధం అంశం అమెరికాలో రాజకీయంగా దుమారం రేగుతోంది. డెమొక్రాట్లు ఈ యుద్ధం ఆవశ్యకతను ప్రశ్నిస్తున్నారు. యుద్ధం మొదలై రెండు వారాలు గడుస్తున్నా దాని లక్ష్యాలను ప్రభుత్వం ప్రజల ముందు ఉంచడం లేదని సెనేటర్ ఎలిజబెత్ వారెన్ ప్రశ్నించారు. మరోవైపు, ప్రతిపక్షాల విమర్శలను వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పందించారు. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' లక్ష్యాలను ఆమె వివరించారు. ఇరాన్ వద్ద ఉన్న ప్రమాదకరమైన క్షిపణి సంపత్తిని, వాటి తయారీ కేంద్రాలను పూర్తిగా నిర్వీర్యం చేయడం, సముద్ర మార్గాల్లో దాడులకు పాల్పడుతున్న ఇరాన్ నౌకాదళాన్ని అణిచివేయడం, అది అణ్వాయుధ దేశంగా మారకుండా శాశ్వతంగా అడ్డుకోవడమే తమ లక్ష్యమన్నారు.

హర్మూజ్‌లో భారత
నౌకలకు ఇరాన్‌అనుమతి-

హర్మూజ్ జలసంధి గుండా భారత చమురు నౌకల రాకపోకలకు ఇరాన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భారత జెండాతో ప్రయాణించే ట్యాంకర్లు హర్మూజ్ జలసంధి ద్వారా వెళ్లేందుకు ఇరాన్ అనుమతించింది. ఈ జలమార్గం ద్వారా ముడిచమురు, సహజ వాయువు రవాణా సురక్షితంగా జరిగేలా చూడాలని మంగళవారం రాత్రి భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జైశంకర్ ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీని ఫోన్‌లో కోరారు. ఇందుకు టెహ్రాన్ సానుకూలంగా స్పందించింది. ఈ నేపథ్యంలో భారత జెండాతో ఉన్న పుష్పక్, పరిమల్ అనే ట్యాంకర్లు సురక్షితంగా హోర్ముజ్ జలసంధిని దాటినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అమెరికా, ఇజ్రాయెల్, ఐరోపా దేశాలకు చెందిన నౌకలు ఆంక్షలు ఎదుర్కొంటున్న సమయంలో ఈ పరిణామం జరిగిందని సంబంధిత వర్గాలు వివరించాయి.

"



సీఎస్కే మాజీ కెప్టెన్ ధోనీ 8 లేదా 9వ స్థానంలో బ్యాటింగ్‌కు రావడం కరెక్ట్ కాదు. ధోనీ ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించగలడు. కేవలం 5 లేదా10 కాకుండా 25-30 బంతులు ఆడితే జట్టుకు మరింత ప్రయోజనం చేకూరుతుంది. ఆయన ముందుగా బ్యాటింగ్‌కు వస్తే ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెరుగుతుంది.

- మాజీ క్రికెటర్ పుజారా



త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో

పోలీస్ శాఖ పాత్ర కీలకం

- **పోలీస్ శాఖలో ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగంలోకి తీసుకురండి**
- **రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కి రూరల్ అగ్రి రీజియన్ పై దృష్టి సారించండి**
- **ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**


ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 12: 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యసాధనలో పోలీసు శాఖ పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మొదట హోంశాఖ, తదుపరి మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద సంఖ్యలో పెట్టుబడిదారులు వస్తున్న నేపథ్యంలో శాంతి భద్రతలు కీలకం అన్నారు. ఈ అంశంలో ఏ చిన్న పొరపాటుకు హోంశాఖ అధికారులు, సిబ్బంది అవకాశం ఇవ్వరాదని, ప్రతి కదలిక మీ కను సన్నల్లో ఉండాలని సూచించారు. విధుల నిర్వహణ క్రమంలో హోం శాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ నగరం ప్రపంచంలో మేటి నగరంగా ఎదుగుతున్న క్రమంలో వేగంగా పలు సంస్కరణలు చేపడుతున్నామని ఇందులో భాగంగా పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని పెంచాలని సూచించారు.

తెలంగాణాకు ఐకాన్ ఓయూ

- **1000 కోట్లతో అభివృద్ధికి రూట్ మ్యాప్**
- **నిధులు మంజూరు అభినందనీయం**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు**
- **మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి**



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 12: ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక ఐకాన్ గా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అటువంటి విశ్వవిద్యాలయం మన రాష్ట్రంలో ఉండడం మనకెంతో గర్వకారణమని ఆయన చెప్పారు. అంతటి పేరెన్నికగన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని తాను కాంక్షిస్తున్నానని ఆయన చెప్పారు. గురువారం ఉదయం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగంలో ఆయన నిర్మాణ్26 సాంకేతిక సదస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 1917 లో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు. అందుకు కొనసాగింపుగా 1929 లో విశ్వవిద్యాలయం సౌజన్యంతో ప్రారంభం అయిన ఇంజినీరింగ్ కళాశాల యావత్ భారతదేశంలోనే అత్యంత ప్రాశస్త్యమైన కళాశాలలలో ఆరవ స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు.అంతటి ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయం అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించడమే కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా 1,000 కోట్లు నిధులు మంజూరు చేయడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్రలోనే ఇంత పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం చారిత్రాత్మక ఘట్టంగా ఆయన అభివర్ణించారు. విశ్వవిద్యాలయంలో అవసరమైన అధ్యాపకుల భర్తీ విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ సీఎంతో చర్చించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అటువంటి విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్ర ఉద్యమంలో అగ్రభాగాన నిలుచోవడమే కాకుండా విద్యార్థులు చేసిన త్యాగాలు ఇక్కడ ప్రస్తావనర్హమే అని భావిస్తున్నానని ఆయన చెప్పారుఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలలో కుడా భాగస్వామ్యం కావాలని ఆయన ఉద్బోధించారు.ఇంజినీరింగ్ విభాగం గురుంచి ఆయన ప్రస్తావిస్తూ తెలంగాణా రాష్ట్ర అభివృద్ధిలో ఇంజినీరింగ్ విభాగం ముఖ్య భూమిక పోషిస్తుందని ఆయన చెప్పారు. నిజాంసాగర్,నాగార్జునసాగర్,శ్రీశైలం వంటి భారీ ప్రాజెక్టులతో పాటు ఎస్ఎల్బీసీ, దేవాదుల వంటి ఆధునిక ప్రాజెక్టులు ఇంజినీరింగ్ ప్రతిభకు అద్దం పడుతున్నాయన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగము విద్యార్థులకు ప్రాక్టికల్స్ పాఠాలుగా ఉపయోగ పడుతాయని ఆయన చెప్పారు. ఇంజినీర్లు ప్రాజెక్టుల నిర్మాణాలకు మాత్రమే పరిమితం కాకుండా వాటి భద్రత,నిర్వహణ బాధ్యతలు కుడా ఇంజినీర్లకు ఉంటాయన్నారు. నిర్మాణ్26 వంటి సాంకేతిక సదస్సులు విద్యార్థులకు పరిశోధన,సృజనాత్మక తాను పెంపొందించే వేడికలని ఆయన చెప్పారు. మన నిర్మాణాలు కేవలము కట్టడాలకే పరిమితము కాకుండా ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు దోహద పడాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉద్బోధించారు.



తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల వేడుకల్లో భాగంగా, తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు, మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక గురువారం మెగాస్టార్ డా. చిరంజీవిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్ఠాత్మక 'ఎన్టీఆర్ నేషనల్ ఫిలిం అవార్డు' ను స్వీకరించాల్సిందిగా వారు చిరంజీవిని సాదరంగా ఆహ్వానించారు. మార్చి 19న హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా జరగనున్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి విచ్చేసి, ఈ గౌరవాన్ని అందుకోవాలని వారు చిరంజీవిని కోరారు. - ప్రతిపక్షం, హైదరాబాద్

జేపీ దర్గా అభివృద్ధికి మరిన్ని నిధులివ్వండి

- **మంత్రి అజారుద్దీన్‌కు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వినతి**



ప్రతిపక్షం, షాద్‌నగర్, మార్చి 12: రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని ప్రఖ్యాత జహంగీర్ పీర్ దర్గా అభివృద్ధికి అదనపు నిధులు మంజూరు చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి అజరుద్దీన్‌ను కోరారు. గురువారం సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో ఆయనను ప్రత్యేకంగా కలుసుకుని దర్గా అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే చర్చించారు. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ నిధులతో రూ.12 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, మరింత సమగ్ర అభివృద్ధి కోసం అదనంగా రూ.8 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.మంత్రి అజారుద్దీన్ స్పందిస్తూ ఇటీవల దర్గాను సందర్శించినట్లు తెలిపారు. దర్గా అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. దీనికి ఎమ్మెల్యే శంకర్ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



ఆరోగ్య రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం

- **ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు**
- **శంషాబాద్‌లో లిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం**

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 12: ఆరోగ్య రంగంలో మౌలిక వసతుల అభివృద్ధి ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుంటోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆధునిక వైద్య సదుపాయాలతో నిర్మించిన లిమ్స్ న్యూరో & కార్డియో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఈ ఆసుపత్రి కీలకంగా ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో మౌలిక వసతుల అభివృద్ధి ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుంటోందన్నారు. ప్రజలకు సమీప ప్రాంతాల్లోనే అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే అవకాశాలు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. శంషాబాద్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రి ద్వారా పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇ కార్యక్రమం లో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కవిత జన్మదిన వేడుకలకు అట్టహాసంగా ఏర్పాట్లు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 12: తెలంగాణ జాగృతి కార్యాలయంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జాగృతి నాయకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా కవిత జన్మదినాన్ని వైభవంగా నిర్వహించేందుకు కార్యకర్తలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ జాగృతి కార్యాలయంలో జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు జాగృతి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ జాగృతి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరుకానున్నారు. కవితకు శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి సభ్యులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.



జర్నలిస్టులకూ క్యాష్‌లెస్ వైద్యం అందించాలి

- **సీఎస్ రామకృష్ణారావుకు టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే వినతి**
- **సర్కారు ఉద్యోగుల తరహాలోనే కార్పొరేట్ చికిత్స అందించాలని విజ్ఞప్తి**

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 12: రాష్ట్రంలోని జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే అన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత (క్యాష్‌లెస్) వైద్యం అందించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే) ప్రతినిధులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుకు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఇన్సూరెన్స్ ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని వారు కోరారు. ఈ మేరకు గురువారం సెక్రటేరియట్ లో సీఎస్ రామకృష్ణారావును టీడబ్ల్యూజేఎఫ్ స్టేట్ యాక్టింగ్ ప్రెసిడెంట్ పి.రాంచందర్, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, హెచ్‌యూజే అధ్యక్షులు బి.అరుణ్ కుమార్, కార్యదర్శి బి.జగదీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, కోశాధికారి బి. రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ బయ్యా దామోదర్, జాయింట్ సెక్రటరీ క్రాంతి తదితరులు కలిశారు. ఈ సందర్భంగా పలు జర్నలిస్టుల సమస్యలపై చర్చించి ఆయనకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగుల కోసం సర్కారు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న 'హెల్త్ కేర్ ట్రస్ట్' పరిధిలోకి జర్నలిస్టులను కూడా తీసుకురావాలని వారు కోరారు. పరిమితి లేని ఉచిత వైద్య సేవలను జర్నలిస్టులకు వర్తింపజేయాలని, ఇందుకోసం అవసరమైన ప్రీమియంను ప్రభుత్వమే బీమా సంస్థలకు చెల్లించాలని సూచించారు. సరైన వైద్యం అందక, ఆర్థిక ఇబ్బందులతో జర్నలిస్టుల కుటుంబాలు పడుతున్న అవస్థలను సీఎస్ దృష్టికి నేతలు తీసుకెళ్లారు. దీనికి సీఎస్ రామకృష్ణారావు సానుకూలంగా స్పందించారు. సీఎం దృష్టికి సమస్యలను తీసుకుపోతామనని హామీనిచ్చారు.

రాష్ట్రానికి యూరియా కేటాయించండి

- **కేంద్ర ప్రభుత్వానికి మంత్రి తుమ్మల లేఖ**
- **ఆరు లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించాలని వినతి**



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 12: ఈ ఏడాది ఖరీఫ్ కోసం ముందస్తుగా యూరియా నిల్వలు సిద్ధం చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రానున్న మూడు నెలలకు ఆరు లక్షల మెట్రిక్ టన్నులు యూరియా కేటాయించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఏప్రిల్, మే, జూన్‌కు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు లేఖ రాసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం హైదరాబాద్‌లో వెల్లడించారు. ఖరీఫ్ ప్రారంభానికి రాష్ట్రంలో సుమారు 50 వేల టన్నుల ప్రారంభ నిల్వలు మాత్రమే ఉండే అవకాశం ఉందన్నారు. తెలంగాణలో 70 శాతం పంటలు ఖరీఫ్ సీజన్‌లోనే సాగవుతాయని మంత్రి తుమ్మల వివరించారు. జూలై, ఆగస్టులలో యూరియా డిమాండ్ గరిష్టంగా పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. నెలకు సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల అవసరమవుతుందని చెప్పారు. ఎరువుల పంపిణీ పారదర్శకతకు యూరియా యాప్ తీసుకొచ్చినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేశారు.



పట్టణాల్లో ఆకస్మిక వరదలను 24 గంటల ముందే అంచనా వేసే 'గ్రౌండ్ సోర్స్' అనే కొత్త ఏఐ మోడల్‌ను రూపొందించాం. 'జెమినీ' సాయంతో ఇది 150+ దేశాల్లో 26లక్షల వరద సంఘటనలను విశ్లేషించింది. శాస్త్రవేత్తల పరిశోధనలు, ప్రజల సేఫ్టీ కోసం ఈ డేటాను గూగుల్ 'ఫ్లడ్ హబ్'లో అందుబాటులో ఉంచాం. ఇందులో ఏరియా పేరు సెర్చ్ చేయాలి. ముప్పు ఉంటే రెడ్ మార్క్ చూపిస్తుంది.
- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్

దళిత శక్తి బలోపేతమే లక్ష్యం

- **టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్‌పర్సన్‌గా కవ్వంపల్లి బాధ్యతలు**
- **గాంధీ భవన్‌లో ఘనంగా పదవి స్వీకారం**
- **కాంగ్రెస్ దళితుల పార్టీ: మహేష్ కుమార్ గౌడ్**
- **విద్యతోనే అభ్యున్నతి: పొన్నం ప్రభాకర్**
- **ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్ అవసరం: వివేక్**



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 12: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం చైర్‌పర్సన్‌గా మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం గాంధీ భవన్‌లో ఘనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, లక్ష్మీకాంత్, యెన్నం శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, నాగరాజు, వినోద్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజయ్య, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, మాజీ ఎమ్మెల్యే మోత్కుపల్లి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ దళితుల పార్టీ: మహేష్ కుమార్ గౌడ్

పీసీసీ బలోపేతం కావాలనే ఉద్దేశంతోనే కవ్వంపల్లి సత్యనారాయణకు ఈ బాధ్యతలు అప్పగించామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. దళితవాదంతో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అండగా నిలిచిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. రాష్ట్రంలో రెడ్డి వర్గానికి సీఎం, బీసీకి పీసీసీ అధ్యక్ష పదవి, దళితులకు డిప్యూటీ సీఎం, స్పీకర్ పదవులు, నాలుగు మంత్రి పదవులు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని విమర్శించారు. 17 శాతం ఉన్న ఎస్సీలకు ఐదు కీలక పదవులు ఇచ్చామని, భవిష్యత్తులో కూడా దళితులకు తగిన ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. సభ్యత్వ కార్యక్రమంలో ప్రతి రోజు కనీసం 100 మంది చొప్పున పార్టీకి చేర్చేలా నాయకులు కృషి చేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లతో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

విద్యతోనే అభ్యున్నతి: పొన్నం ప్రభాకర్

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి విద్యే ప్రధాన సాధనమని అన్నారు. నెహ్రూ నుంచి రాహుల్ గాంధీ వరకు కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం కోసం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. దేశ ఐక్యతకు కాంగ్రెస్ పార్టీ మాత్రమే కృషి చేస్తోందని తెలిపారు.

ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్ అవసరం: వివేక్

మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఎస్సీలకు అన్ని రంగాల్లో 18 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బడ్జెట్ లో కూడా అదే శాతం కేటాయించాలని సూచించారు. రైతు రుణమాఫీలో ఎస్సీ రైతులకు తక్కువగా ప్రయోజనం అందిందని పేర్కొన్నారు. కాంట్రాక్టులు, కార్పొరేషన్లలో కూడా దళితులకు తగిన అవకాశాలు కల్పించాలన్నారు.

దళితుల ఐక్యతే కాంగ్రెస్ బలం: మోత్కుపల్లి

మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ దళిత వర్గాలు కలిసి ముందుకు రావడం వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. దళితుల మధ్య ఐక్యత కొనసాగితేనే రాష్ట్రంలో కాంగ్రెస్ బలం మరింత పెరుగుతుందని చెప్పారు. సమస్యలు తలెత్తితే ప్రతినెల సమావేశాలు నిర్వహించి పరిష్కరించుకోవాలని సూచించారు.

దళితులే కాంగ్రెస్‌కు వెన్నెముక: అడ్లూరి లక్ష్మణ్

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో దళితుల పాత్ర కీలకమని అన్నారు. ఎస్సీ సెల్ కాంగ్రెస్‌కు గుండె లాంటిదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

సీఎం ఆశయాల సాధనకు కృషి: కవ్వంపల్లి

టీపీసీసీ ఎస్సీ విభాగ చైర్‌పర్సన్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతోనే తాను ఎమ్మెల్యేగా, ఇప్పుడు ఎస్సీ విభాగ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టానని తెలిపారు. రాష్ట్రంలో 59 ఉపకులాలకు చెందిన ఎస్సీలను ఏకతాటిపైకి తీసుకురావడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. పదవుల్లో దళితులకు 18 శాతం ప్రాతినిధ్యం కల్పించాలని పీసీసీ అధ్యక్షుడికి విజ్ఞప్తి చేశారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ కోసం కృషి చేస్తానని తెలిపారు.

ప్రాంతీయం

వెలుగుమట్ల బాధితుల చేతికి పట్టాలు
తెలంగాణ జాగృతి చారిత్రాత్మక విజయం

- జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి



ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 12: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలో కబడ్డీ పాండురంగారెడ్డి మాట్లాడుతూ...పేదల పక్షాన నిలబడితే ఫలితం ఎలా ఉంటుందో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, కల్వకుంట్ల కవిత మరోసారి నిరూపించారని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో పేదల ఇళ్ల కూల్చివేతపై ఆమె చేపట్టిన రాజీలేని పోరాటం నేడు గొప్ప విజయాన్ని సాధించిందని ఆయన కొనియాడారు.గతంలో వెలుగుమట్ల ఘటనలో పేదల ఇళ్లను అర్ధరాత్రి వేళ బుల్డోజర్లతో కూల్చివేయడాన్ని కవిత తీవ్రంగా ఖండించి, బాధితులకు న్యాయం జరిగే వరకు విశ్రమించేది లేదని ప్రకటించారు. ఖమ్మం గడ్డపై బాధితులను పరామర్శించిన నాటి నుండి నేటి వరకు నిరంతర ఆందోళనలు, ధర్నాలు, మరియు నిరాహార దీక్షలతో ప్రజాస్వామ్యయుత పోరాట పటిమతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. కవితక్క పట్టుదలకు, తెలంగాణ జాగృతి కార్యకర్తల ఆందోళనలతో కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చింది. బాధితులకు ఇళ్ల స్థలాలు మరియు పట్టాలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించడం కవిత నాయకత్వానికి దక్కిన విజయమని పాండురంగారెడ్డి తెలిపారు. పేదలకు భూమిపై హక్కు లేదన్న సర్కార్ మాటలను తలకిందులు చేస్తూ, బాధితుల చేతనే పట్టాలు పట్టించిన ఘనత కవితక్క గారిదేనని ఆయన స్పష్టం చేశారు. గతంలో బీసీ రిజర్వేషన్ల కోసం జాతీయ స్థాయిలో పోరాడి విజయం సాధించిన కవిత , నేడు వెలుగుమట్ల ఇష్యూను పరిష్కరించి పేదల గుండెల్లో చెరగని ముద్ర వేశారని ఆయన అన్నారు. "కవిత గారు రంగంలోకి దిగితే న్యాయం జరగాల్సిందే" అన్న నమ్మకాన్ని ప్రజల్లో ఈ విజయం మరోసారి బలపరిచిందని పేర్కొన్నారు. బాధితులకు పట్టాలు పంపిణీ చేయడంతో కవిత గారు తన నిరాహార దీక్షను విరమించారు. ఈ విజయం తెలంగాణ జాగృతి శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని కప్పాటి పాండురంగారెడ్డి వెల్లడించారు.



ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 12: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3వ వార్డు సభ్యులు నయీమ్ ఖాన్, తోపాటు ఆయిల మహిపాల్ గౌడ్ పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయి అని అన్నారు. పదవ తరగతి పరీక్షలో రాయడం కోసం విద్యార్థిని విద్యార్థులకు ప్యాడ్లు, జామెంటరీ బాక్సులు, పెన్నులు, పరీక్షలు రాయడానికి సరిపడా సామాగ్రిని అందజేశారు. గ్రామానికి చెందిన విద్యార్థిని విద్యార్థులు మొదటి ర్యాంకులలో వచ్చిన వారికి తగిన బహుమతి అందజేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. మండల కేంద్రంలోని ఉత్తమ అవార్డు తెచ్చుకునే విధంగా ప్రతి విద్యార్థిని విద్యార్థులు ప్రయత్నించాలి అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకొని పిల్లలని దగ్గరుండి ఎగ్జామ్స్ రాయించుకొని తీసుకొని రావాలన్నారు. విద్యార్థినిలకు పరీక్ష కేంద్రానికి వెళ్లడానికి సమకూర్చిన సామాగ్రి ఇప్పిచ్చినందుకు విద్యార్థినీలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య గౌడ్, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలియజేశారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే సొంత ఇంటి కల నెరవేరుతుంది

- సర్పంచ్ దేవేందర్ నాయక్



ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 12: ఇందిరమ్మ రాజ్యంలోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల గంగారం గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ అన్నారు. గురువారం ఉదయం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసిన గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్, కాంగ్రెస్ ప్రభుత్వం లోనే పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఇన్చార్జి కేఎల్ఆర్ ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి ముందుకు తీసుకెళ్తానని తెలియజేశారు. గ్రామంలో ఇంకా ఎవరైనా ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవాలనుకుంటే తెలియజేయాలని కోరారు. గ్రామంలో ఏ ఒక్కరికి ఎలాంటి సమస్య ఉన్న అధికారుల దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కారం అయ్యే విధంగా ప్రయత్నిస్తానని గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ తెలియజేశారు.



కొన్ని పార్టీలు ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నాయి

- హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలి
- జల్ పల్లి ఇఫ్తార్ విందులో కేఎల్ఆర్

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 12: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రంలోని జెల్ పల్లిలో జరిగిన ఇఫ్తార్ విందులో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యులర్ భావాజలమే భారతదేశ ప్రజల బలమని అన్నారు. దేశం, రాష్ట్రంలో కొన్ని విచ్ఛిన్నకర శక్తులు, పార్టీలు కలిసి కుల, మతాలను విడదీసి ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు.హిందూ, ముస్లిం భాయి.. భాయి నినాదం స్వాతంత్ర్యం నాటి నుంచి ఉందన్నారు. సోదర భావంతో కలిసి మెలిసి పండుగలను జరుపుకోవాలని లక్ష్మారెడ్డి కోరారు. ఈనెల 17న జల్ పల్లి, పహాడీషరీఫ్, షహీన్ నగర్ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్లు కిచ్చెన్న ప్రకటించారు. అందరం సమానం... కులం, మతం వ్యక్తిగతమని లక్ష్మారెడ్డి మరోసారి స్పష్టం చేశారు. రంజాన్ సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు భగవంతుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి సహా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



వైద్యం యాంత్రికంగా ఉండొద్దు. మానవత్వంతో కూడిన చికిత్స అందించాలి. ప్రైవేట్ రంగంలోని డాక్టర్లు ఏడాదిలో ఒక నెల ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేయాలి. రాష్ట్రంలో 65 లక్షల మంది హెల్త్ డేటా తయారు చేస్తున్నాం. వాళ్లకు డిజిటల్ హెల్త్ కార్డులిస్తాం. 1.30 కోట్ల కుటుంబాలకు జీవిత బీమా అందించాలని భావిస్తున్నాం. క్యాన్సర్‌కు చికిత్స పైనా దృష్టి పెట్టాం.
- సీఎం రేవంత్ రెడ్డి

మూసీ బ్యూటిఫికేషన్ పేరుతో లూటిఫికేషన్

- రెడ్కో మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 12: మూసీ నది అభివృద్ధి పేరుతో ప్రభుత్వం చేపట్టిన బ్యూటిఫికేషన్ కార్యక్రమంపై రెడ్కో మాజీ చైర్మన్ వై. సతీష్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం నిజంగా బ్యూటిఫికేషన్ చేయడం లేదని, లూటిఫికేషన్ చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆయన ఆరోపించారు. మూసీ ప్రాజెక్టు కోసం లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) కూడా సిద్ధం కాలేదని ఆయన అన్నారు. ఆర్కిటెక్ట్‌లు రూపొందించిన అసలు డిజైన్లు లేకుండానే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా తయారు చేసిన చిత్రాలను విడుదల చేసి ప్రజల్లో ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు పంపిన ఆహ్వాన పత్రికలో ఒక డిజైన్ ఉండగా, వ్యాపారవేత్తలు మరియు రాజకీయ నాయకులతో జరగనున్న సమావేశానికి పంపిన ఆహ్వాన పత్రికలో మరో డిజైన్ ఉందని ఆయన తెలిపారు. రెండు కూడా ఏఐ ద్వారా తయారు చేసిన చిత్రాలేనని, నిజమైన ఆర్కిటెక్ట్ డిజైన్ ఏదీ ఇప్పటివరకు విడుదల కాలేదని చెప్పారు. ఇలాంటి చిత్రాలను ఏఐ సాయంతో ఖర్చు లేకుండా పెద్దఎత్తున తయారు చేయవచ్చని, అలాంటి చిత్రాల ఆధారంగా లక్షన్నర కోట్ల రూపాయల ప్రాజెక్ట్ ప్రకటించడం వెనుక ప్రభుత్వ ఉద్దేశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. రెండేళ్లు గడిచినా డీపీఆర్ సిద్ధం చేయకుండా పేదల ఇళ్లను కూల్చివేయడం, అపార్ట్‌మెంట్లను తొలగిస్తామని హెచ్చరించడం సరైన విధానం కాదని సతీష్ రెడ్డి అన్నారు. ఏఐ చిత్రాలతో ప్రచారం చేసి శంకుస్థాపనలు చేసి, కాంట్రాక్టుల పేరుతో కమిషన్లు పొందడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని ఆరోపించారు. మూసీ నది శుద్ధి చేసి పరిసరాలను మెరుగుపరచాలనే దృష్టికంటే, భూములను వ్యాపారవేత్తలకు కేటాయించడం ద్వారా భారీగా ఆర్థిక లాభాలు పొందాలనే ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. మూసీ అభివృద్ధి పేరుతో జరుగుతున్న కార్యక్రమం నిజంగా ప్రజల ప్రయోజనాల కోసం కాకుండా కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం జరుగుతోందని ఆయన విమర్శించారు.



మదనపల్లి లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు యువకుల దుర్మరణం

ప్రతిపక్షం, షాద్ నగర్,మార్చి 12: రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలానికి కి చెందిన యువకులు మదనపల్లి లో గురువారం ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. మదనపల్లి సమీపంలో వేగంగా వచ్చిన ఒక గుర్తు తెలియని వాహనం బైక్‌ను బలంగా ఢీకొట్టి, వారిపై నుండి దూసుకెళ్లింది. ఈ భీభత్సమైన ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న సూరజ్, బిక్కి అనే ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో సూరజ్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుండగా, బిక్కి పి&జి లోని చిన్ను ఇంజనీరింగ్‌లో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. చేతికి అందొచ్చిన కుమారులు కళ్లముందే విగతజీవులుగా పడి ఉండటంతో వారి కుటుంబాల్లో పెను విషాదం నెలకొంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సిసిటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. గుర్తు తెలియని వాహనం అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వంటగ్యాస్ కొరతను నివారించాలి

- గ్యాస్ ఏజెన్సీ వద్ద బీఆర్ఎస్ నిరసన



ప్రతిపక్షం,హుస్నాబాద్, మార్చి12: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు వంటగ్యాస్ కొరత లేకుండా చూడాలని, అక్రమంగా సిలిండర్లను నిల్వ చేసి ఎక్కువ ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని ఓ గ్యాస్ ఏజెన్సీ వద్ద గురువారం ఆయన ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా యుద్ధాలు జరుగుతున్న తరుణంలో సామాన్యులపై గ్యాస్ భారం పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో గ్యాస్ బుకింగ్ చేస్తుంటే సర్వర్ సమస్యలతో గంటల తరబడి సమయం వృథా అవుతోందని, దీంతో వినియోగదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ కొరత లేదని ప్రకటనలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో బుకింగ్ కాక పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. గృహ, వాణిజ్య అవసరాలకు గ్యాస్ అందకపోవడాన్ని ఆసరాగా తీసుకుని దళారులు ఎల్‌పీజీని బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు అమ్ముతున్నారని ఆరోపించారు.అధికారులు స్పందించి అక్రమ విక్రయాలపై నిఘా పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొజ్జ హరీష్ తదితరులు పాల్గొన్నారు.



పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రతిపక్షం, చేవెళ్ల, మార్చి 12: రాబోయే పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని బిఆర్ఎస్ మండల పార్టీ కార్యదర్శి ఊరడి రాంప్రసాద్ ఆకాంక్షించారు. చేవెళ్ల మున్సిపల్ ఊరెళ్ళ వార్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షల కోసం అవసరమైన ప్యాడ్లు, పెన్నులు, స్టేషనరీ సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ... ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పబ్లిక్ పరీక్షలను ధైర్యంగా రాసి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉత్తేజపరిచారు. ఈ సహకారం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఇలియాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమ్మద్ అక్బర్, కృష్ణ, ప్రకాశ్ రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరి

- సురంగల్‌లో 198 పశువులకు టీకాలు

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 12 : పశువులను గాలికుంటు వ్యాధి (ఎఫ్ఎండీ) నుంచి రక్షించుకోవడానికి టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా. అహ్మద్ తెలిపారు. మండలంలోని సురంగల్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి (ఎఫ్ఎండీ) నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా మొత్తం 198 పశువులకు టీకాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. పశువులను గాలికుంటు వ్యాధి నుంచి రక్షించుకోవాలంటే టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది ప్రసన్న కుమార్, భీమ్ రావు, గోరెమియా పాల్గొని పశువులకు టీకాలు వేశారు. రైతులు ఈ టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.



బాకారం జాగీర్‌లో అండర్ డ్రైనేజ్ పనులు ప్రారంభం

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 12 : బాకారం జాగీర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని గ్రామ సర్పంచ్ ఎల్లని వెంకటేష్‌గౌడ్ తెలిపారు. మొయినాబాద్ మండల కేంద్రంలోని బాకారం జాగీర్ గ్రామపంచాయతీ పరిధిలో 9, 10వ వార్డుల్లో అంతర్గత అండర్ డ్రైనేజ్ పనులను గురువారం ప్రారంభించారు. ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, వార్డు సభ్యులతో కలిసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొంతం నాగేశ్వర్ రెడ్డి, రాయనోళ్ల ఉపేందర్ యాదవ్, బంధి అనిల్, కొండకల్ల రవి, దినేశ్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి శివశంకర్, కరోబర్ జగన్నాథ్, నాయకులు పి. రాఘవరెడ్డి, కొండకల్ల మహేందర్, బిక్షపతి గౌడ్, కొండకల్ల శ్రీకాంత్, కావాలి కిరణ్, విజయ్ కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి



ప్రతిపక్షం, చేవెళ్ల, మార్చి 12: చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పామెన శివారులోని సంస్కృతి స్కూల్‌లో విద్యార్థులు, సిబ్బందికి అగ్నిమాపక భద్రతపై అవగాహన కల్పించేందుకు ఫైర్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటిని ఎలా నివారించాలి అనే విషయాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలకు కారణమయ్యే సాధారణ అంశాలు, వాటిని నివారించేందుకు పాటించాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో అగ్ని ఎలా అదుపులోకి తేవాలి, ఫైర్ సేఫ్టీ పరికరాలను ఎలా వినియోగించాలనే విషయాలపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. దీంతో విద్యార్థులు భద్రతా చర్యల ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది మాట్లాడుతూ... విద్యార్థులు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండటం వలన తమ చుట్టుపక్కల వారిని చైతన్యవంతులుగా చేసి ప్రమాదాలను నివారించవచ్చునని వివరించారు. వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు వంట చేసేటప్పుడు గ్యాస్ వాడకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమాన్ని హెడ్ కానిస్టేబుల్ దస్తగిరి, కానిస్టేబుళ్లు ప్రశాంత్, గోపాల్, నరసింహ, శివకుమార్ నిర్వహించి విద్యార్థులకు ఉపయోగకరమైన భద్రతా సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఏ. శశిపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ రేహానా పాల్గొన్నారు.

ప్రాంతీయం

అంబరాన్నంటిన మహిళా దినోత్సవ సంబరాలు

- పటాన్ చెరు కు తరలి వచ్చిన మహిళలోకం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఆలోచింపచేసిన ఉపన్యాసాలు
- మహిళా పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 12 : పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఆయన సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి ల ఆధ్వర్యంలో గురువారం పటాన్ చెరు పట్టణంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు అంబరాన్ని అంటాయి. నియోజకవర్గ పరిధిలోని మహిళా ప్రజా ప్రతినిధులు, వేలాదిమంది మహిళలు కార్యక్రమానికి హాజరయ్యారు. ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ అంశాలపై ప్రముఖులచే ఉపన్యాసాలు, బహుమతుల పంపిణీ కార్యక్రమాలు అందరిని ఉత్సాహపరిచాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ఒక కుటుంబంలో మహిళా విద్యావంతురాలు అయితే ఒక తరం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు. సర్వైకల్ క్యాన్సర్ విముక్తి కోసం ప్రభుత్వం అందిస్తున్న HPV వ్యాక్సిన్ ను బాలికలతో మొదలు మహిళలందరూ వేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత 25 సంవత్సరాలుగా పటాన్చెరు కేంద్రంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఆడ కూతురు ఉన్నత చదువులు చదువుకోవాలన్న సమున్నత లక్ష్యంతో పటాన్చెరు పట్టణంలో కేజీ నుండి పీజీ వరకు ఆధునిక వసతులతో ప్రభుత్వ విద్యాసంస్థలు నెలకొల్పడం జరిగిందని తెలిపారు. ప్రముఖ వైద్యులు, ఎమ్మెల్యే కోడలు గూడెం కిరణ్మయి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కుటుంబానికి వెన్నెముకగా నిలిచే మహిళ తన ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి సంవత్సరం విధిగా ఆరోగ్య చికిత్సలు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న HPV వ్యాక్సిన్ తప్పకుండా వేయించుకోవాలని కోరారు. జిఎంఆర్ ఫౌండేషన్ ద్వారా సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు.

వడ్లు ఒలుపు శ్రీరాముని కొలుపు

- భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామరాజు



ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 12: భద్రాచల రామయ్య కల్యాణనికి గ్రామ, గ్రామాన కోటి తలంబ్రాల దీక్షలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని గోటితో వడ్లు ఓలిచి అందిస్తున్నారని భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత, శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు తెలిపారు. గురువారం నాడు రామకోటి కార్యక్రమంలో మాట్లాడుతూ భక్తులు భక్తి శ్రద్ధలతో శ్రీరామ నామ జపం చేస్తూ ప్రతి రోజు లక్షల మంది భక్తులు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గోటితో వడ్లు వలిచి అందించి భక్తిని చాటుకుంటున్నారని తెలిపారు. ఈ మహా యజ్ఞంలో భాగం కావాలనుకుంటే తక్షణమే రామకోటి కార్యాలయంలో గోటి తలంబ్రాల ప్యాకెట్లు తీసుకోవాలన్నారు.



సిద్దిపేటలో 109 సెల్‌ఫోన్లు రికవరీ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 12: సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సిద్దిపేట పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పోగొట్టుకున్న 109 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. సుమారు పది లక్షల రూపాయల విలువ గల ఫోన్లను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బాధితులకు అప్పగించారు.ఈ సందర్భంగా సీపీ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ... సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు ఆందోళన చెందకుండా వెంటనే (www.ceir.gov.in) లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పోర్టల్ ద్వారా పోయిన మొబైల్ ఫోన్లను సులభంగా గుర్తించి తిరిగి పొందే అవకాశం ఉందన్నారు.పోయిన మొబైల్ ఫోన్ల పట్ల నిర్లక్ష్యం వహిస్తే వ్యక్తిగత సామాజిక భద్రతకు భంగం కలగవచ్చని హెచ్చరించారు. పోయిన ఫోన్ల రికవరీ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పనిచేస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు జిల్లాలో 200 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, ట్రైనీ ఐపీఎస్ ఆయేషా ఫాతిమా, సిద్దిపేట ఏసీపీ రవీందర్, గజ్వేల్ ఏసీపీ నర్సింలు, ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, కానిస్టేబుల్ పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా 'నృసింహుడి' బ్రహ్మోత్సవాలు

- హంస వాహనంపై ఊరేగింపు

ప్రతిపక్షం, గజ్వేల్ (వర్గల్) మార్చి 12: వర్గల్ మండలం నాచారం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవంలో భాగంగా స్వామివారు హంస వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. బుధవారం రాత్రి పురవీధుల్లో ఊరేగిస్తూ సభ మండపం పైన స్వామివారి ఆశీనులు గావించి భక్తులు భజన , భక్తి పాటలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి రంగాచారి, సభ్యులు చందా నాగరాజు, ఉష రాజశేఖర్ శర్మ, జక్కన్న గారి శేఖర్ గుప్తా, కొత్తపల్లి శ్రీనివాస్, నాచారం ఉప సర్పంచ్ వినయ్ ఆలయ సిబ్బంది వేలూరు మరియు యావపూర్ భజన మండలి సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్ట్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 12: సిద్దిపేట పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సాజిద్‌పురకు చెందిన ఎండి అర్షద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత కొంతకాలంగా తన మటన్ షాప్ సరిగా నడవక పోవడానికి అర్షద్, అతని తమ్ముడు షాహిద్ కారణమని అనుమానంతో ఎండి షాబుద్దీన్ కక్ష పెంచుకున్నాడు. జనవరి 10వ తేదీ సాయంత్రం సుమారు 5:30 గంటల సమయంలో షాబుద్దీన్ ఇనుప రాడుతో షాహిద్ తలపై వెనుక నుండి దాడి చేయగా అతనికి తీవ్ర గాయాలు అయ్యాయి. అడ్డుకొనేందుకు వచ్చిన అర్షద్‌పై కూడా కాళ్లపై ఇనుప రాడుతో దాడి చేశాడు.గాయపడిన షాహిద్‌ను ముందుగా సిద్ది పేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి పంపించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడు ఎండి షాబుద్దీన్‌ను గురువారం అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల

సహకార సంఘాల క్షేత్ర పర్యటన

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 12: ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో బి.కాం విద్యార్థులకు మెదక్ మరియు కొత్తపల్లి సహకార సంఘాలకు విద్యాపరమైన క్షేత్ర పర్యటన నిర్వహించారు.ఈ పర్యటన ద్వారా విద్యార్థులు సహకార సంఘాల నిర్వహణ విధానం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వాటి పాత్ర, రైతులకు అందించే సేవలపై ప్రత్యక్ష అవగాహన పొందారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి (డీసీవో) కరుణాకర్ మాట్లాడుతూ.. గ్రామీణ అభివృద్ధిలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. రైతులకు తక్కువ వడ్డీపై రుణాలు ,ఎరువులు, విత్తనాలు అందిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయని చెప్పారు. కొత్తపల్లి సహకార సంఘం ప్రత్యేక అధికారి శంకర్ మాట్లాడుతూ.. సంఘం కార్యకలాపాలు, సభ్యులకు అందించే సేవలు, రుణాల పంపిణీ విధానం గురించి విద్యార్థులకు వివరించారు. రైతులకు అందించే సేవల గురించి తెలియజేశారు.కామర్స్ విభాగాధిపతి డాక్టర్ శరత్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు పుస్తకాలలో నేర్చుకునే సిద్ధాంత జ్ఞానంతో పాటు ప్రాయోగిక అవగాహన కూడా అవసరమని అన్నారు.ఇటువంటి క్షేత్ర పర్యటనలు విద్యార్థులలో ప్రాయోగిక జ్ఞానాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ ఉద్యోగి విష్ణు భరత్, అధ్యాపకులు డాక్టర్ చంద్రశేఖర్, శ్రీనివాస్, డాక్టర్ హరిత, రఫిక్ పాల్గొన్నారు.



ఘనంగా ముగిసిన జిల్లా పోలీసు క్రీడా పోటీలు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చ్ 12: మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయం మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జిల్లా పోలీసు క్రీడా పోటీలు ఘనంగా ముగిశాయని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు విభాగాలకు చెందిన సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. క్రీడలు సిబ్బందిలో ఐక్యత, స్నేహభావం పెంపొందించడమే కాకుండా విధుల్లో ఉండే ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయని ఎస్పీ పేర్కొన్నారు. క్రికెట్ ఫైనల్‌లో డిఏఆర్ మెదక్ జట్టు డీపీవో మెదక్ జట్టుపై విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. కబడ్డీ పోటీలో డిఏఆర్ మెదక్ జట్టు మెదక్ డివిజన్‌పై గెలిచి విజేతగా నిలిచింది. వాలీబాల్ పోటీలో డిఏఆర్ మెదక్ జట్టు తూప్రాన్ డివిజన్‌పై విజయం సాధించింది. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో సత్యనారాయణ విజేతగా, సుధాకర్ రన్నర్‌గా నిలిచారు. డబుల్స్‌లో యాదగిరి-దీనకర్ జోడీ విజేతలుగా నిలవగా, ఆంజనేయులు-రమేష్ జోడీ రన్నర్స్‌గా నిలిచారు.అధికారుల విభాగంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ మహేష్ జోడీ విజేతలుగా నిలిచారు. మహిళల విభాగంలో తేజస్విని, దేవిభాయి విజేతలుగా నిలవగా, సింగిల్స్‌లో మౌనిక విజేతగా, పూజ రన్నర్‌గా నిలిచింది.విజేతలకు జిల్లా ఎస్పీ ట్రోఫీలు, మెడల్స్ అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, శుభష్ చంద్ర బోస్, రంగనాథ్, సీఐలు జార్జ్, కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి, మహేష్, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది కవి సమ్మేళనం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 12: వెన్నెల సాహితీ సంగమం ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ ఉగాది కవి సమ్మేళనం ఈ నెల 14శనివారం ఉదయం 10:00 గంటల నుండి సిద్దిపేట ప్రెస్ క్లబ్లో నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవిరచయిత కోడంప పవన్ కుమార్ ప్రధాన అతిథిగా హాజరవుతారు. విశిష్ట అతిథులుగా ప్రముఖ కవిరచయిత, తెరవే రాష్ట్ర అధ్యక్షులు కొండిమల్లా రెడ్డి, ఆత్మీయ అతిథిగా సొప్పదండి విద్యాసాగర్ పాల్గొంటారు. కవిసమ్మేళనంలో పాల్గొనే కవులు, కవయిత్రులకు లోకకవి అందెశ్రీ ఉగాది పురస్కారంతో పాటు జ్ఞాపికను అందజేయబడుతుంది. కవులు, కవయిత్రులు సాహిత్యాభిమానులు విచ్చేసి ఈ కవిసమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని వెన్నెల సాహితీ సంగమం అధ్యక్షులు వంగర నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్కపెల్లి యాదగిరి తెలిపారు.



గ్రామపంచాయతీ కార్మికుల

సమస్యలు పరిష్కరించాలి

- పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలి
- ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించిన సిఐటియు నాయకులు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 12: గత ఎన్నికల ముందు గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను ఈ అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కోశాధికారి.కడారి నర్సమ్మ కోరారు. గురువారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి నెల 5వ తేదీ లోపు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని, జీతాల పెంపు, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. గత మూడు నెలలుగా వేతనాలు రాక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అర్ధాకలితో జీవనం సాగిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాలని వినతి పత్రాలు అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. మార్చి 17న నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమంలో జిల్లాలోని గ్రామపంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు సత్తయ్య, లాలూ ప్రసాద్, బాబు, మరియమ్మ, ఆయమ్మ, దుర్గయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు ప్రజా సేవే ప్రధాన లక్ష్యం కావాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- గ్రామాభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు కట్టుబడి పని చేయాలి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి
- సిద్దిపేటలో ప్రజాపాలన – ప్రగతి 99 రోజుల కార్యాచరణపై అవగాహన కార్యక్రమం








ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 12: ప్రజాప్రతినిధులు ప్రజా సేవే ప్రధాన లక్ష్యంగా భావించి సమాజానికి సేవ చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు.సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రెడ్డి సంక్షేమ సంఘ భవనంలో గురువారం "ప్రజాపాలన - ప్రగతి 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక"పై మున్సిపల్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, గ్రామ సర్పంచులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధ్యక్షత వహించారు.కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి, జిల్లా అదనపు కలెక్టర్ (ఎస్ఎల్బీ) అబ్దుల్ హమీద్ ,వివిధ శాఖల అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి వీడియో సందేశాన్ని ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమాన్ని ఐదు దశల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, రోడ్డు భద్రత, సంక్షేమ కార్యక్రమాలు, రైతు సంక్షేమం, విద్యా కార్యక్రమాలు, యువజన క్రీడలు, మహిళా అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై వివిధ శాఖలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాయని వివరించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు కట్టుబడి పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గ్రామాల్లో పిచ్చి మొక్కలను తొలగించాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి దశరథ్, జిల్లా అటవీ శాఖ అధికారి పద్మజా రాణి, అదనపు డీసీపీ కుషాల్కర్, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్యతో పాటు ఇతర శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగితే అమెరికాకే బెనిఫిట్. అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఉత్పత్తిదారు. ధరలు పెరిగితే యూఎస్‌కు భారీగా ఆదాయం వస్తుంది. కానీ అది మా ప్రాధాన్యం కాదు. న్యూక్లియర్ వెపన్స్ తయారు చేయకుండా, పశ్చిమాసియాతో పాటు ప్రపంచాన్ని నాశనం చేయకుండా ఇరాన్‌ను అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యం.

\- అమెరికా అధ్యక్షుడు ట్రంప్

ప్రాంతీయం



పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద

సెక్షన్ 163 అమలు

- పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 12: సిద్దిపేట జిల్లాలో జరగనున్న పదవ తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ మేరకు పోలీస్ కమిషనర్ భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 163 ప్రకారం ఉత్తర్వులు జారీ చేశారు.జిల్లాలోని మొత్తం 82 పరీక్షా కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటాన్ని నిషేధించారు. ఈ ఆంక్షలు మార్చి 14, 2026 నుండి ఏప్రిల్ 16, 2026 వరకు పరీక్షలు జరిగే ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు అమలులో ఉంటాయి.పరీక్షా కేంద్రాల పరిసరాల్లో కర్రలు, రాళ్లు, ఆయుధాలు లేదా ఇతర ప్రమాదకర వస్తువులు తీసుకురావడం నేరంగా పరిగణిస్తారు. అలాగే పరీక్షలకు సంబంధించిన నిషేధిత కాగితాలు తీసుకెళ్లడం పూర్తిగా నిషేధించారు. పరీక్షల సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని అధికారులు ఆదేశించారు .ఈ ఆంక్షల నుండి విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సైనిక సిబ్బంది, విద్యాశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, అంత్యక్రియల ఊరేగింపులకు మినహాయింపు ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా పోలీస్ శాఖ అన్ని కేంద్రాల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తుందని కమిషనర్ తెలిపారు. ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పెద్ద శివునూరులో వరి పంటలు సర్వే చేసిన అధికారులు

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 12: చేగుంట మండలం పెద్ద శివనూర్ గ్రామంలో వ్యవసాయ అధికారులు పంటల సర్వే చేపట్టారు. రబీ సీజన్ లో సాగు చేస్తున్న వరి పంటల విస్తీర్ణం వివరాలను మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ నమోదు చేశారు. బోరు బావుల వద్ద చెరువుకుంటల వెనుక వేసిన వరి పంటలను పరిశీలించి తగిన మోతాదుల్లో క్రిమిసం వారక మందులు వాడాలని రైతులకు సలహాలు ఇచ్చారు. నత్రజని యూరియా మోతాదులో వాడాలని వివరించారు. క్రిమిసంహారక మందులు పిచికారి చేసే సమయంలో వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విస్తీర్ణ అధికారి భువనేశ్వరి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆంజనేయులు గ్రామ రైతులు పాల్గొన్నారు.



నేడు కాంగ్రెస్ ప్రభుత్వ అధికారిక ఇఫ్తార్ విందు

- ముస్లిం ప్రజలు అందరూ హాజరు కావాలి
- సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట మార్చి 12: రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా ముస్లిం ప్రజలకు శుక్రవారం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్నట్లు సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ, పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ తెలిపారు. సిద్ధిపేట లో ఏర్పాటు చేసిన సమావేశంలో సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ... శుక్రవారం రోజున సాయంత్రం సిద్దిపేట పట్టణంలోనీ మదీనా ఫంక్షన్ హాల్ లో ఇఫ్తార్ విందుకు ముస్లిం ప్రజలు హాజరు కావాలి అని కోరారు.కార్యక్రమంలో పాల్గొంటున్న భూగర్భ గనులు ఉపాధి కల్పన శాఖ మంత్రి ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొంటారు అని అన్నారు. ముస్లిం ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులు పార్టీలకు అతీతంగా పాల్గొనాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కలీముద్దీన్. తప్పెట శంకర్. గయాసుద్దీన్ . మార్క సతీష్ గౌడ్. బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



ఫోటో ఎగ్జిబిషన్ సందర్శించిన జిల్లా అధికారులు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్ ,మార్చి 12: సమాచార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలపై ఫోటో ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా ఎస్పీ డి .వి శ్రీనివాసరావు, నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు సందర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో డిపిఆర్ఓ కే రామచంద్ర రాజు, ఏపీఆర్ఓ బాబు, డిపిఆర్ఓ సిబ్బందితో కలిసి ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించే విధంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ , జిల్లా అధికారులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలను వారు పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి అవగాహన కల్పించేలా ఈ ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం పట్ల డిపిఆర్ఓ రామచంద్ర రాజు,ఏపీఆర్ఓ బాబు, ఫోటోగ్రాఫర్ ప్రదీప్ ను, సమాచార శాఖ సిబ్బంది నీ కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు, నోడల్ అధికారి శ్రీనివాస్ , సంబంధించిన ప్రజా ప్రతినిధులు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నల్లగా ఉన్నావు.. నీకు చదువెందుకు?

- పాఠశాల నుండి వెళ్లిపో
- గురుకుల పాఠశాలలో ఏఎన్ఎం వ్యాఖ్యలు
- తీవ్ర మనోవేదనకు గురైన విద్యార్థిని



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 12: నల్లగా ఉన్నావ్ నీకు చదువెందుకు? మీ అమ్మానాన్నలు అడవి నుండి వచ్చారా అంటూ విద్యార్థినిపై గురుకుల పాఠశాలలో ఏఎన్ఎం అవమానకరంగా వ్యాఖ్యలు చేసింది. కిడ్నీ స్టోన్ సమస్యతో ఇంటికి వెళ్లిన విద్యార్థిని గురుకుల పాఠశాలలోకి అనుమతి ఇవ్వడానికి అడ్డు చెప్పడమే కాకుండా, అడవి నుండి వచ్చిన వారిని ఎందుకు తీసుకుంటారో టీసీ ఇచ్చి పంపాలని విద్యార్థితో పాటు తల్లిదండ్రులపై చేసిన వ్యాఖ్యలతో విద్యార్థిని తీవ్ర మనోవేదనకు గురైంది. దీనిపై ఆ విద్యార్థి తల్లిదండ్రులు మీడియాను ఆశ్రయించిన ఘటన మెదక్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్లో జరిగింది. ఈ విషయమై బాధితులు గురువారం జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం నాయిని జలాల్ పూర్ గ్రామానికి చెందిన ఎల్లం జ్యోతి దంపతుల కుమార్తె మనస్విని మెదక్ లోని గురుకుల బాలికల పాఠశాల లో ఏడవ తరగతి చదువుకుంటోంది. ఫిబ్రవరి 20న కడుపు నొప్పి రావడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. పాఠశాలకు వెళ్లిన వెళ్లిన తల్లిదండ్రులు విద్యార్థిని మనస్వినిని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. స్వల్పంగా కిడ్నీ స్టోన్ ఉందని, నీళ్లు ఎక్కువగా తాగితే సరిపోతుందని వైద్యులు చెప్పడంతో మళ్లీ స్కూల్ కు వెళ్లారు. అయితే కిడ్నీలో స్టోన్ పూర్తిగా తగ్గాకే రావాలని చెప్పారు. దీంతో స్కూల్లో చేర్పించి వెళ్లిపోయారు. మళ్లీ అస్వస్థతకు గురి కావడంతో తల్లిదండ్రులు స్కూలుకు వచ్చారు. అదే స్కూల్లో ఉన్న ఏఎన్ఎంను నొప్పి గురించి అడిగితే తిక్కగా సమాధానం చెప్పినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ''జంగిల్ నుంచి వచ్చే వారిని స్కూల్లో ఎందుకు చేర్చుకుంటారు?'' అని తల్లిదండ్రుల ముందే అనడంతో వారు తీవ్ర అవమానంగా భావించారు. టీసీ ఇచ్చి పంపేయాలని చెప్పడం వివాదానికి దారితీసింది. విద్యార్థితో పాటు తల్లిదండ్రులు నల్లగా ఉండడం వల్లనే ఏఎన్ఎం ఈ విధంగా వ్యాఖ్యలు చేసినట్లు వారు చెబుతున్నారు. అయినప్పటికీ స్కూల్లో చేర్చుకోవాలని బ్రతిమాలినా, కిడ్నీలో స్టోన్ తగ్గినట్టు డాక్టర్ సర్టిఫికెట్ తీసుకువస్తేనే జాయిన్ చేసుకుంటామని ప్రిన్సిపాల్ పాటు సిబ్బంది చెప్పినట్లు విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థి నల్లగా ఉండడం వల్లే స్కూల్లో చేర్చుకోకుండా అవమానకరంగా మాట్లాడారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎన్ఎంతో పాటు స్కూల్లో చేరకుండా అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం పై ప్రిన్సిపల్ తారా సింగ్ మాట్లాడుతూ, అలా మాట్లాడటం తప్పేనని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గురుకుల పాఠశాలలో అట్టడుగు వర్గాల విద్యార్థులు మాత్రమే చదువుతున్నారని వారికి మంచి భోజనంతో పాటు మంచి చదువు అందించాలని ప్రభుత్వ ఉద్దేశాన్ని మరిచి గురుకుల సిబ్బంది ఇలా మాట్లాడడంపై ప్రభుత్వం వెంటనే స్పందించి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



జలప్రదాతకు పాలాభిషేకం

- హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపిన రైతులు

ప్రతిపక్షం బ్యూరో, సిద్ధిపేట, మార్చి 12: సిద్ధిపేట నియోజకవర్గంలోని గంగాపూర్ గ్రామ పరిసర ప్రాంతాల్లో సాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఉపశమనం లభించింది. కాలువ పనులు పూర్తికాకపోవడంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు స్వంత ఖర్చులతో కాలువ త్రవ్వకాలు చేపట్టించి రైతు పంట పొలాలకు నీరు అందేలా చర్యలు తీసుకున్నారని వారు పేర్కొన్నారు. గుర్రాలగొంది, గంగాపూర్ గ్రామాలకు చెందిన రైతులు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ,హరీష్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ భవాని వేణు యాదవ్ స్వప్న హరీష్ మాట్లాడుతూ... "కాలువ పనులు చేపట్టడంలో ప్రభుత్వం సహకారం అందించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. అయితే హరీష్ రావు స్వంతంగా సుమారు రూ.2 లక్షల ఖర్చుతో మిషన్లు ఏర్పాటు చేసి కాలువ త్రవ్వకాలు చేయించి రైతులకు సాగునీరు అందించారు" అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామ గౌడ్ సహా పలువురు రైతులు పాల్గొన్నారు. సిద్ధిపేట జిల్లాలో రైతుల పట్ల హరీష్ రావు చూపిస్తున్న శ్రద్ధ అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.



ఉపాధి హామీ చట్టంపై

మోదీ ప్రభుత్వ కుట్రలు

- పేదల బతుకులపై కేంద్రం దాడి!
- జీ.ఆర్.జీ రామ్ జీ చట్టాన్ని మార్చాలని సంతకాల సేకరణ
- ఉపాధి హామీ కూలీల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆపదు
- నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 12: సిద్ది పేట అర్బన్ మండలం గ్రామీణ పేదల జీవనాధారమైన ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పన్నుతున్న కుట్రలను సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ తీవ్రంగా ఖండించారు. పేదల బతుకులతో రాజకీయాలు చేయడం అత్యంత దారుణమని ఆయన మండిపడ్డారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లి, నాంచారుపల్లి, వెల్కటూరు, ఎల్లుపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కర్మచారి చైర్మన్ అఖిల్‌తో కలిసి మాట్లాడిన పూజల హరికృష్ణ, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని క్రమంగా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గ్రామీణ పేదల కష్టార్జిత హక్కుగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంకు తగిన నిధులు కేటాయించకుండా, పని దినాలను తగ్గిస్తూ కూలీలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన అన్నారు. పేదల పొట్టకొట్టే విధానాలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. "దేశంలో కోట్లాది గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ఈ ఉపాధి హామీ పథకాన్ని కాపాడటం కాంగ్రెస్ పార్టీ బాధ్యత. పేదల కోసం తీసుకొచ్చిన ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయాలనే మోదీ ప్రభుత్వ కుట్రలను మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. కూలీలకు సంవత్సరానికి 100 రోజుల పని హామీ యథావిధిగా కొనసాగించాలి. చేసిన పనికి సమయానికి వేతనాలు చెల్లించాలి. లేదంటే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని పూజల హరికృష్ణ హెచ్చరించారు.గ్రామాల్లోని ఉపాధి హామీ కూలీలు కూడా పథకాన్ని ఇదివరకు ఉన్న విధంగానే కొనసాగించాలని కోరుతూ తమ సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా జీ.ఆర్.జీ రామ్ జీ చట్టంలో మార్పులకు వ్యతిరేకంగా కూలీల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. పేదలు, కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుండి పోరాడుతుందని, వారి హక్కుల కోసం అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమాలు కూడా చేపడతామని పూజల హరికృష్ణ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిక్షపతి, తడ్కపల్లి గ్రామ అధ్యక్షులు పర్శరాములు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి, కలిముద్దీన్ అహ్మద్, దాస అంజన్న,డీసీసీ మహిళా అధ్యక్షులు ముద్దం లక్ష్మి, నాంచారుపల్లి సర్పంచ్ నర్సింహా రెడ్డి, వెల్కటూరు సర్పంచ్ నరేష్, అంబటి మహేష్ గౌడ్, ఎర్ర మహేందర్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులు స్థానిక ప్రతినిధులు

- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్
- స్థానిక ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమం



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 12: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లాలని అర్హులైన ప్రజలందరికీ అందాలని ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారదులు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అన్ని అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు సమన్వయం చేసుకుంటూ అభివృద్ధిని పాటుపడాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ లో భాగంగా జిల్లాలోని మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు, జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్, రాష్ట్ర అబ్జర్వర్ మోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఆర్డీవో రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, డీఎల్పీఓ అధికారి సాయిబాబా జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ జ్యోతి ప్రజ్వలనభజన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టంగా తీసుకున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 కార్యక్రమం విజయవంతపు చేయడం కోసం జిల్లా అధికారులు స్థానిక సంస్థ ప్రతినిధులు సర్పంచులు కౌన్సిలర్లు చైర్మన్లు వైస్ చైర్మన్లు కృషి చేయాలని అని అన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన పేద ప్రజలకు అందాలంటే గ్రామంలోనా ప్రజాప్రతినిధులు అధికారులతోటే సాధ్యమవుతుంది అని అందుకే ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు స్థానిక ప్రజాప్రతినిధులని ఆమె అన్నారు. సర్పంచులు నా ఊరు నా గ్రామము అని అనుకున్నప్పుడు అభివృద్ధి సాధ్యమైతుందని గ్రామాన్ని ప్రగతి రూపంలోకి తీసుకురావచ్చు అని ఆమె తెలిపారు. గ్రామం అభివృద్ధి చెందుతే గ్రామ సర్పంచుకు మంచి పేరు వస్తుందని ప్రభుత్వ తరఫున అవార్డులు సైతం వస్తాయని గ్రామ సర్పంచ్ నా గ్రామం అభివృద్ధి చెందాలని ప్రతి ఒక్కరికి ఆ భావన కలిగి ఉండాలని అర్హులైన పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఆమె తెలిపారు నూతనగా ఎన్నికైన గ్రామ సర్పంచులకు కౌన్సిలర్లకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అబ్జర్వర్ మోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో పరిపాలన విధానంలో ప్రజలకు మూడు విధాలుగా పరిపాలన సాగుతుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు పరోక్షంగా ఉపయోగపడితే స్థానిక సంస్థలు ప్రజలకు నేరుగా ఉపయోగపడతాయని ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధుల వద్దకు వచ్చి తమ సమస్యలను విన్నవించుకుంటారని అందుకే నేరుగా గ్రామ ప్రజాప్రతినిధులకు ప్రజలకు సత్సంబంధాలు ఉంటాయని అభివృద్ధి జరగాలంటే స్థానిక ప్రజాప్రతినిధులు అన్ని అంశాల పట్ల అవగాహన ఉండాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందాలంటే జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ అర్హులైన పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని అందుకోసమే శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అవగాహన కార్యక్రమంలో మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, డిఎల్పిఓ సాయిబాబా, మెదక్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు మాట్లాడారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల చైర్మన్లు. వైస్ చైర్మన్లు, 67 మంది కౌన్సిలర్లు, 492 మంది సర్పంచులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఎఫ్ఓ జోజి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రంలో డొమెస్టిక్ గ్యాస్‌కు కొరత లేదు. దీనిపై ప్రజలు ఆందోళన చెందొద్దు. కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయి. హోటల్ పరిశ్రమకు ఎల్పీజీ అవసరాలు తీర్చడం పెద్ద సమస్య. రేపు గ్యాస్ కంపెనీలతో సమావేశమై పరిస్థితిపై ఆరా తీసి తగిన చర్యలు తీసుకుంటాం. సిలిండర్లు బ్లాక్ చేస్తే ఏజెన్సీలను రద్దు చేస్తాం.

- మంత్రి ఉత్తమ్ కుమార్



ప్రాంతీయం

ప్రజలకు జవాబుదారీగా నిలుస్తూ మెరుగైన సేవలు అందించాలి

- **స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల అవగాహన సదస్సులో కలెక్టర్ ఇలా త్రిపాఠి**



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 12 : అభివృద్ధికి పాటుపడతారనే నమ్మకంతో గెలిపించిన ప్రజలకు జవాబుదారీగా నిలుస్తూ, వారికి మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు హితవు పలికారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నూతనంగా ఎన్నికైన నిజామాబాద్ నగర పాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ చైర్ పర్సన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లకు గురువారం నిజామాబాద్ శివారులోని బోర్గం(పి)లో గల భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. అదేవిధంగా అమృతా గార్డెన్ లో సర్పంచ్ లకు అవగాహన సదస్సు జరిగింది. ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల అధికారాలు, విధులు, బాధ్యతల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ, ప్రింటెడ్ మెటీరియల్ ను అందజేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, నగర మేయర్ కే.ఉమారాణి, డిప్యూటీ మేయర్ సల్మా తహసీన్ తదితరులు ఈ సదస్సులలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, హక్కులు, అధికారాలతో పాటు బాధ్యతలను సైతం సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నూతనంగా ఎన్నికైన స్థానిక సంస్థల సభ్యులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను గుర్తిస్తూ, వాటి పరిష్కారం కోసం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని, తద్వారా సంబంధిత అధికారులు, సిబ్బందితో నిర్దేశిత పద్ధతిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయవచ్చని తెలిపారు. అధికారుల నుండి సరైన సహకారం అందని పక్షంలో తమ దృష్టికి తేవాలని, జిల్లా యంత్రాంగం తప్పక సహకరిస్తుందని కలెక్టర్ భరోసా కల్పించారు. అధికారాలు, హక్కుల గురించి స్పష్టమైన అవగాహన కలిగి ఉన్నప్పుడే బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించగల్గుతారని అన్నారు. నిధులు, విధులను సక్రమంగా వినియోగిస్తూ, అందరి సమన్వయంతో వార్డుల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని మార్గనిర్దేశం చేశారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా అమలు చేయాల్సిన గురుతర బాధ్యత స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై ఉందని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నిధులు, విధులను సక్రమంగా వినియోగిస్తూ, అందరి సమన్వయంతో గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని మార్గనిర్దేశం చేశారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయాలనే ప్రగాఢ సంకల్పంతో ముందుకు సాగాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో అందరిని భాగస్వాములు చేస్తూ, ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా చొరవ చూపాలన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ, ప్రజల అవసరాలను గుర్తిస్తూ, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాల్సిన గురుతర బాధ్యత స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై ఉందని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ సదస్సుల లో రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీపీఓ శ్రీనివాస్ రావు, డీఆర్డీఓ సాయాగౌడ్, డీఈఓ అశోక్, ఏ.ఓ రాజబాబు, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ చైర్ పర్సన్లు, వైస్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



బీసీ సంక్షేమానికి నిధులు కేటాయించాలని నిరసన

ప్రతిపక్షం, మంచిర్యాల ప్రతినిధి, మార్చి 12: బీసీ సంక్షేమానికి 50 వేల కోట్లు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం బీసీ సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుండి ప్రారంభం కారున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బీసీ సంక్షేమానికి 50వేల కోట్లు బడ్జెట్ కేటాయించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వస్తే ఐదు సంవత్సరాలలో బీసీల సంక్షేమానికి లక్ష కోట్ల బడ్జెట్ పెడతామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి రెండున్నర ఏండ్లు గడుస్తున్నా మొదటి బడ్జెట్ సమావేశాలలో 900 కోట్లు రెండో బడ్జెట్ సమావేశాల్లో 11 వేల కోట్లు మాత్రమే బడ్జెట్ ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు ప్రతి బడ్జెట్ సమావేశాల్లో హరాకోర నిధులు విడుదల చేస్తూ బీసీలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు రాష్ట్ర జనాభాలో 56% బీసీల జనాభా ఉంటే ఇక బీసీల అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు .రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధికంగా పన్నులు చెల్లించేది బీసీ సమాజమే అన్నారు బడ్జెట్ కేటాయింపులో బీసీలకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు రానున్న బడ్జెట్ సమావేశాల్లో 50 వేల కోట్లు బడ్జెట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం చేపడతామని తెలిపారు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు భూముల శ్రీనివాస్ నాయకులు గజల్ వెంకటయ్య వేముల అశోక్ చంద్రగిరి చంద్రమౌళి అంకం సతీష్ రాజన్న చారి తదితరులు పాల్గొన్నారు.



గోవింద్ పేట్ పీహెచ్ సీని తనిఖీ చేసిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 12 : ఆర్మూర్ మండలం గోవింద్ పేట్ లో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఆయా విభాగాలను సందర్శించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును గమనించారు. అందుబాటులో ఉన్న మందుల స్టాక్, వైద్యులు, సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. వివిధ వార్డులను సందర్శించి రోగులకు కల్పిస్తున్న సదుపాయాలను గమనించారు. బ్లడ్ శాంపిల్స్ సేకరిస్తూ, మధుమేహం, మలేరియా వంటి వ్యాధుల నిర్ధారణ, వాటి బారిన పడిన వారికి అందిస్తున్న చికిత్సల గురించి అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. కాగా, పీ.హెచ్.సీలో గురువారం రోజున ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న కలెక్టర్, ఆయా విభాగాలకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు శిబిరానికి హాజరయ్యారా అని ఆరా తీశారు. ఈ తరహా ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ముందస్తుగానే సమాచారం చేరవేయాలని సూచించారు. ఆర్థోపెడిక్, గైనిక్, డెంటిస్ట్, జనరల్ ఫిజీషియన్ తదితర విభాగాల ద్వారా ప్రత్యేక శిబిరంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కస్తూర్బాగాంధీ, జ్యోతిబాపూలె విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాలలో కూడా క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్దేశించిన కార్యక్రమాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ తదితరులు ఉన్నారు.



పిల్లల భద్రత – డ్రగ్స్‌కు అడ్డుకట్టపై అవగాహన కార్యక్రమం

ప్రతిపక్షం, గుండాల, మార్చి 12: ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "పిల్లల భద్రత - డ్రగ్స్‌కు అడ్డుకట్ట" అనే అంశంపై గుండాల మండలంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మండలంలోని నర్సాపురం,గుండాల గ్రామ పంచాయతీ కార్యాలయం,టీజీటిడబ్ల్యూఆర్ఎస్ ,పాఠశాలలో నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ఈగల్ టీం సీఐ, గుండాల సీఐ, గుండాల ఎస్సై,తహసిల్దార్,ఎక్సైజ్ శాఖ అధికారులు, చైల్డ్ సూపరింటెండెంట్, ఎంఈఓ, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌లు,ప్రజాప్రతినిధులు, విద్యార్థులు హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల ఆరోగ్యం, భవిష్యత్తు,కుటుంబ జీవితంపై తీవ్రమైన ప్రభావం పడుతుందని తెలిపారు.యువత, పిల్లలు డ్రగ్స్‌కు దూరంగా ఉండేందుకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అనుమానాస్పద వ్యక్తులతో లేదా చెడు స్నేహితులతో కలవకుండా ఉండాలని,ఎవరు ఇచ్చినా తెలియని మాత్రలు లేదా పదార్థాలు తీసుకోకూడదని సూచించారు.చదువు, క్రీడలు, మంచి కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని చెప్పారు.అలాగే ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం కనిపిస్తే వెంటనే తల్లిదండ్రులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సోషల్ మీడియా ప్రభావానికి లోనుకాకుండా పిల్లలు, యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యులు కూడా పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టి వారికి సరైన మార్గదర్శనం ఇవ్వాలని అన్నారు.పిల్లల భద్రత,డ్రగ్స్ నివారణపై సమాజంలో అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు తమ సూచనలు తెలియజేశారు.



బహుజన రాజకీయ యుద్ధ భేరి గోడ పత్రిక విడుదల!

- **బహుజన రాజ్యాధికారమే బీఎస్పీ లక్ష్యం!**
- **బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్**

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట, మార్చి 12: బహుజన్ సమాజ్ పార్టీ హైదరాబాద్ లో ఈ నెల 15వ తేదీన నిర్వహించబోయే ఛలో బడంగ్ పేట్ రాజకీయ యుద్ధ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఎస్పీ నారాయణ పేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ కోరారు. గురువారం మక్తల్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బహిరంగ సభ గోడ పత్రికను విడుదల చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని మెజారిటీ వర్గాలైన బహుజన వర్గాలను రాజ్యాధికారం వైపు నడిపించడమే బీఎస్పీ లక్ష్యమన్నారు. ఆధిపత్య కుల పార్టీలైన బీజేపీ కాంగ్రెస్,పార్టీలు నేటికి బీసీ,ఎస్సీ ,ఎస్టీ కులాలను అణచివేస్తూ రాజ్యాధికారం సాధించి బహుజనుల్ని బానిసలుగా చేస్తున్నాయన్నారు.కేవలం ఓట్లకోసమే పేద ప్రజలకు పథకాల పేరుతో మభ్యపెట్టి మోసం చేస్తున్నారని ఆరోపించారు. బహుజన రాజ్యం వస్తేనే పేదల బ్రతుకులు మారుతాయని, అది బీఎస్పీ ద్వారానే సాధ్యమన్నారు. ఈ నెల 15వ తేదీన హైదరాబాద్ లోని బడంగ్ పేట్ లో నిర్వహించే బహిరంగ సభకు జిల్లాలోని బహుజన ప్రజానీకం తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జోనల్ ఇంచార్జ్ జుట్ల నరేందర్,బీఎస్పీ నాయకులు పరశురామ్,అజయ్ కుమార్,తిరుపతయ్య,భీమయ్య,రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సహారా ఇండియా కార్యాలయం ముందు బాధితుల ధర్నా

ప్రతిపక్షం, మంచిర్యాల ప్రతినిధి, మార్చి 12: సహారా ఇండియా కార్యాలయం ముందు బాధిత కుటుంబాలు గురువారం ధర్నా నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సహారా ఇండియా ఏజెంట్లు ఏళ్ల తరబడి కల్లబొల్లి మాటలు చెబుతూ కార్యాలయం చుట్టూ తిరిగే పరిస్థితి ఉందని వాపోయారు. డిపాజిట్ చేసిన డబ్బులను వెంటనే తమకి ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధర్నా నిర్వహించి సంబంధిత మేనేజర్ కు వినతిపత్రం అందజేశారు. సింగరేణి ప్రాంతంలో పైసా పైసా జమ చేసి సహారా ఖాతాలలో నిల్వ చేసుకుంటే నస్పూర్, మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి కార్యాలయంలో ఏజెంట్లు మేనేజరు ఖాతాదారులకు అనేక ఇబ్బందులు వెళుతున్నారని ఆరోపించారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి తమ డబ్బులు తమకు ఇప్పించే దిశగా చొరవ తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో నిరాహార దీక్షకు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో సహార్ ఇండియా డిపాజిటర్లు గజల్ వెంకటయ్య, జి వెంకట్ రెడ్డి, పెద్దపల్లి మల్లయ్య, కాంతయ్య, డి రాజమౌళి, అంకం సతీష్, శంకర్ పిరికి రెడ్డి, అరుణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



హిందూ ధర్మ పరిరక్షణ కోసం సంసిద్ధులవ్వాలి

- **అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ**

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 12 : హిందూ ధర్మం కాపాడడం కోసం హిందూ సైన్యమంతా ఏకమై మన సనాతన హిందూ ధర్మాన్ని కాపాడాల్సిన అవసరం ప్రతి ఒక్క హిందువుపై ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. హిందువులు వారి వారి ఇష్టానుసారంగా వివిధ పార్టీలలో ఉన్నప్పటికీ వారి అంతిమ లక్ష్యం మాత్రం హిందూ ధర్మాన్ని కాపాడాల్సిందిగా ఉండాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వినాయక్ నగర్ లోని హనుమాన్ జంక్షన్ లో గల శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఒకప్పుడు ఇందూరులోని వినాయక్ నగర్ లో ప్రత్యేకంగా ఏర్పడిన ఈ హనుమాన్ ఆలయం వల్ల ఈ ప్రాంతం హనుమాన్ జంక్షన్ గా పిలువ పడుతుందని అన్నారు. అది ఈ ఆలయానికి ఉన్న గొప్పతనం అని పేర్కొన్నారు. ఈ ఆలయ నిర్మాణంలో భాగంగా ఇక్కడి ప్రాంత వాసులు ముందుకు వచ్చి ఒక్కొక్కరి వద్ద చెందాలు జమ చేసి 54 ఫీట్ల భారీ హనుమాన్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారని ఇది ఇందూరుకే గర్వకారణమని కొనియాడారు. నిజామాబాద్ లోని ప్రముఖ ఆలయాలలో ఈ ఆలయం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. అఖిలభారత హనుమాన్ దీక్ష పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ దుర్గాప్రసాద్ స్వామీజీ మంగళ శాసనములతో హనుమాన్ దీక్ష స్వాములకు ప్రతినిత్యం బిక్ష (అన్నదాన ప్రసాదం) చేయబడుతుందన్నారు. ఈరోజు ఈ కార్యక్రమంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా హనుమాన్ భక్తులకు ఎమ్మెల్యే స్వయంగా భోజనాన్ని వడ్డించారు.

ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలను తనిఖీ చేసిన కలెక్టర్

- **మైనర్ బాలికతో కిచెన్ లో పనులు చేయిస్తుండడం పట్ల ఆగ్రహం**
- **కళాశాల ప్రిన్సిపాల్ కు షోకాజ్ నోటీసు జారీ**
- **సదరు బాలికను పాఠశాలలో చేర్పించాలని అధికారులకు ఆదేశం**



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 12 : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాగారంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్, డైనింగ్ హాల్ లను సందర్శించి నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించారు. విద్యార్థినుల కోసం వండిన అన్నం, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. కిచెన్ శుభ్రంగా ఉంచుకోవాలని, లేని పక్షంలో ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. కాగా, కిచెన్ లో మైనర్ బాలిక (16) పనులు చేస్తుండడాన్ని గమనించిన కలెక్టర్, ఆమె గురించి వాకబు చేశారు. తన పెద్దమ్మతో కలిసి గత కొన్ని రోజులుగా కిచెన్ లో వంట పనులలో సహాయం చేస్తున్నానని సదరు బాలిక కలెక్టర్ కు తెలిపారు. దీంతో కలెక్టర్ కళాశాల నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చదువుకునే వయస్సు కలిగిన మైనర్ బాలికతో ప్రభుత్వ విద్యా సంస్థలో ఎలా పనులు చేయిస్తున్నారని నిలదీశారు. దీనిని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి, కళాశాల ప్రిన్సిపాల్ సయ్యదా జైనబ్ కు షోకాజ్ మెమో జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చక్కగా చదువుకోవాలని, ప్రభుత్వ పరంగా అన్ని వసతులు కల్పిస్తామని బాలికకు కలెక్టర్ భరోసా కల్పించారు. బాలికను సమీపంలోని పాఠశాలలో చేర్పించి, ఉచిత విద్యా, వసతి అమలయ్యేలా చూడాలని సీ.డీ.పీ.ఓ, ఎం.ఈ.ఓలను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ డిగ్రీ విద్యార్థినులకు కొద్దిసేపు వివిధ అంశాలపై బోధన చేశారు. చక్కగా చదువుకుని ఉన్నత విద్యను పూర్తి చేసుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సూచించారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఈ దశలో చదువును ఆపకూడదని మార్గనిర్దేశం చేశారు.

గ్యాస్ వినియోగదారులు ఈ–కేవైసీ చేయించుకోవాలి



ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 12: గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) నమోదు చేయించుకోవాలని గజ్వేల్ శేషమా ఇండియన్ గ్యాస్ నిర్వాహకుడు నంబూరి రామలింగేశ్వరరావు కోరారు. గురువారం గజ్వేల్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు దేశవ్యాప్తంగా గ్యాస్ కనెక్షన్లను ఆధార్ తో అనుసంధానం చేస్తూ ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. గత కొన్ని నెలలుగా గ్యాస్ డీలర్లు మొబైల్ యాప్ ల ద్వారా వినియోగదారుల వద్దకు వెళ్లి ఈ-కేవైసీ నమోదు చేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ ఇప్పటికీ లక్ష్యానికి తగ్గ స్థాయిలో నమోదు జరగలేదని పేర్కొన్నారు. ఈ-కేవైసీ చేయించుకోని వినియోగదారులకు భవిష్యత్తులో సిలిండర్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తే అవకాశముందని ఆయన స్పష్టం చేశారు. కాబట్టి ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ తో సమీప గ్యాస్ ఏజెన్సీ లేదా డెలివరీ సిబ్బందిని సంప్రదించి వెంటనే ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు. ఇక రీఫిల్ సిలిండర్ బుకింగ్ నిబంధనల్లో కూడా మార్పులు చేసినట్లు తెలిపారు. ఇకపై 25 రోజుల తరువాత మాత్రమే రీఫిల్ బుకింగ్ చేసుకోవాలని అన్నారు. వినియోగదారులు ఈ మార్పులను గమనించి ముందుగానే బుకింగ్ ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. గజ్వేల్ పరిధిలో ఉన్న వినియోగదారులందరూ త్వరగా ఈ-కేవైసీ నమోదు పూర్తి చేసి ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని నంబూరి రామలింగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

“



జగన్ చేసిన విధ్వంసానికి తాము అప్పుల భారం మోస్తున్నాం. కూటమి ప్రభుత్వం రూ.3లక్షల కోట్ల అప్పులు చేసిందన్న జగన్ వ్యాఖ్యలు అబద్ధం. మేము రూ.1.05 లక్షల కోట్లే అప్పు చేశాం. రాష్ట్ర ఆదాయం ఎక్కడా తగ్గలేదు. రెవెన్యూ లోటు ముందు నుంచే ఉంది. వైసీపీ హయాంలో ఎంత దోపిడీ జరిగిందనేది రేపో, మాపో ఈడీ బయటపెడుతుంది.
- ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రాంతీయం



విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేసిన ప్రెస్ క్లబ్

ప్రతిపక్షం, గుండాల, మార్చి 12: గుండాల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 50 మంది విద్యార్థులకు గుండాల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రాంబాబు, ఉపాధ్యక్షులు ఎస్కే షారోజ్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలు సాధించాలంటే విద్య ఎంతో ముఖ్యమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. శ్రావణ సంధ్య, ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు వేల్పుల నరసింహారావు, మంకిడి సుధాకర్, కె. నాగార్జున, రమణ బాబు, రమేష్, గణేష్, మలిపెద్ది పవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



టీజీ పీఎస్సీ ద్వారా సర్వేయర్ పోస్టులను భర్తీ చేయాలి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, మార్చి 12: టీజీపీఎస్సీ ద్వారా వెంటనే సర్వేర్ పోస్టులను భర్తీ చేయాలని పుడమి ఫౌండేషన్ చైర్మన్ వెంకటపతి రాజు డిమాండ్ చేశారు. B.Tech, M.Tech చేసి కూడా లక్షలు పెట్టి కుటుంబం వదిలి చాలీ చాలని జీతంతో చదివిన చదువుకు సంబంధం లేకుండా వేరే పనులు చేస్తున్నారన్నారు. తెలంగాణలో ఇప్పటి వరకు గవర్నమెంట్ సర్వేయర్ల కొరతా చాలా ఉందని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకొని తమ సమస్యలు పరిష్కరిస్తుందని ఎదురుచూస్తున్నామన్నారు. ప్రభుత్వం రాక ముందు ఎన్నో హామీలు ఇచ్చిందని, ఇందులో భాగంగా అనేక ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేస్తున్న క్రమంలో సర్వే నోటిఫికేషన్ మాత్రం తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారన్నారు. లక్షల్లో డబ్బులు వెచ్చించి సివిల్ సర్వేర్లుగా లక్షల్లో అభ్యర్థులు నిరుద్యోగులుగా మారిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చదివిన చదువుకి టీజీపీఎస్సీ నోటిఫికేషన్ వేసి భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో భూత్పూర్ అశోక్, ఓబులేష్, కేశవ్, అశోక్, రాము, క్రాంతి, పరుశురాం, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



మంగంపేట ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే గూడెం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 12 : జిన్నారం మున్సిపల్ పరిధిలోని మంగంపేట గ్రామంలో బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు ఖదిర్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆత్మశుద్ధికి, క్రమ శిక్షణకు, దైవారాధనకు రంజాన్ పవిత్ర మాసం ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. శుక్రవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటుచేసిన నియోజకవర్గస్థాయి ఇఫ్తార్ విందును విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, షేక్ హుస్సేన్, మైనార్టీ మత పెద్దలు, సీనియర్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గొప్ప స్వచ్ఛంద సేవకులుగా ఎదగండి

- **గీతం విద్యార్థులకు జిల్లా అగ్నిమాపక శాఖాధికారి పిలుపు**


ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 12 : ఏదైనా అనుకోని విపత్తులు సంభవించినప్పుడు స్వీయ రక్షణతో పాటు తోటి పౌరులను రక్షించడం కోసం వారం రోజుల శిక్షణా తరగతులను గీతం విద్యార్థులకు అందజేస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకుని గొప్ప స్వచ్ఛంద సేవకులుగా ఎదగాలని సంగారెడ్డి జిల్లా అగ్నిమాపక శాఖాధికారి బి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. తెలంగాణ అగ్నిమాపక విపత్తు స్పందన అత్యవసర పౌర రక్షణ శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల 'పౌర రక్షణ స్వచ్ఛంద శిక్షణ సామర్థ్య నిర్మాణం" కార్యక్రమాన్ని గురువారం రోజు హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశారు. దీనిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల సౌజన్యంతో నిర్వహిస్తున్నారు. గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మతో కలిసి, నాగేశ్వరరావు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకులకు (విద్యార్థులకు) అగ్నిప్రమాదాలు, విమాన, రసాయన, అణు విస్ఫోటనం, వరదలు, భవన సముదాయాలు కూలిపోవడం, రోడ్డు ప్రమాదాలు, భూకంపాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తక్షణమే ఎలా ప్రతిస్పందించాలి అనే దానిపై శిక్షణ ఇస్తున్నారు. అలాగే, వైద్య సిబ్బంది సహకారంతో, క్షతగాత్రులకు ప్రథమ చికిత్సతో పాటు సీపీఆర్ ప్రక్రియ, స్ట్రెచర్లపై తరలింపు వంటి వాటిపై కూడా తర్ఫీదు ఇస్తున్నారు. వీటితోపాటు, జన సమూహాన్ని అదుపు చేయడం, విపత్తు సమయంలో ప్రజలకు ఔషధాలు, ఆహార పంపిణీ వంటి వాటిపై కూడా శిక్షణ ఉంటుంది. ఈ కార్యక్రమం వారం రోజులపాటు (ఈనెల 18వ తేదీ వరకు) కొనసాగనుంది. ఈ శిక్షణలో భాగంగా, తొలి రోజు పటాన్ చెరు అగ్నిమాపక కె.వి. నాగేంద్ర విద్యార్థులకు అగ్నిమాపక పరికరాల వినియోగం. అనుకోకుండా ఏదైనా మంటలు చెలరేగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రతలు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ శిక్షణలో కార్యక్రమ ప్రారంభోత్సవంలో సంగారెడ్డి అగ్నిమాపకాధికారి ఎస్. భిక్షపతి, ఇతర అధికారులు, పలువురు సిబ్బంది, గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్, అధ్యాపకులు ప్రొఫెసర్ కె. మంజునాథాచారి, డాక్టర్ పాతుడు, ఎస్టేట్ అధికారులు డీవీఏ మోహన్, ఎం. సతీష్, భద్రతాధికారి కె. సంతోష్ కుమార్ యాదవ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్

- **పైలెట్ ప్రాజెక్టుగా సంగారెడ్డి జిల్లా**
- **సంగారెడ్డి జిల్లాలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపకల్పన**
- **అమలు పై రాష్ట్ర, జిల్లా స్థాయి వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమన్వయ సన్నాహక సమావేశం**



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 12: రాష్ట్రంలో ప్రజలకు అందుతున్ వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ వ్యవస్థను అమలు చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా సంగారెడ్డి జిల్లాలో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపకల్పన, అమలు పై రాష్ట్ర, జిల్లా స్థాయి వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమన్వయ సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంగారెడ్డి జిల్లాను డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు పైలెట్ జిల్లాగా ఎంపిక చేసిన నేపథ్యంలో, ప్రాజెక్టు అమలు విధానం, ముందస్తు ఏర్పాట్లు, అవసరమైన సాంకేతిక సదుపాయాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్. చొంగ్తు, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో ఉదయ్ కుమార్, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్టు అమలులో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని మొత్తం 64 ప్రభుత్వ వైద్యశాలల్లో (జీజీహెచ్-1, ఏరియా ఆసుపత్రులు-4, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు-5, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు-4, ప్రైమరీ హెల్త్ సెంటర్లు-31, బస్తీ దవాఖానాలు-19) సేవలు పొందేందుకు వచ్చే ప్రతి రోగికి సంబంధించిన పూర్తి ఆరోగ్య వివరాలతో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ ను రూపొందించి డిజిటల్ హెల్త్ కార్డు జారీ చేయడానికి కసరత్తును ప్రారంభించాలని మంత్రి ఆరోగ్యశాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రోగి ఆసుపత్రికి వచ్చిన మొదటి దశ నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ఓపీ, మెడికల్ ఆఫీసర్, ల్యాబ్, ఫార్మసీ వంటి అన్ని విభాగాల్లో రోగి వైద్య చరిత్రను డిజిటల్ రూపంలో నమోదు చేసే విధంగా అవసరమైన ఐటీ సదుపాయాలు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని మంత్రి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు సూచించారు. డిజిటల్ హెల్త్ కార్డు ద్వారా రోగి పూర్తి వైద్య చరిత్ర డిజిటల్ రూపంలో అందుబాటులో ఉండటం వల్ల వైద్యులు తక్షణమే సరైన చికిత్స అందించ దానికి సౌలభ్యం కలుగుతుందని మంత్రి తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులలో అందిస్తున్న ఎన్‌సీడీ, కమ్యూనికేబుల్ డిసీజెస్, ఎంసిహెచ్, చైల్డ్ హెల్త్ సేవలు, క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తించి అవసరమైతే రిఫరల్ సిస్టమ్ ద్వారా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. సంగారెడ్డి జిల్లాలో అమలు చేయనున్న ఈ పైలెట్ ప్రాజెక్టును అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ హెల్త్ కార్డు అమలు కోసం సంగారెడ్డి జిల్లాలో చేపట్టే ఈ పైలెట్ ప్రాజెక్టు ఆదర్శంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్టు రూపకల్పనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, డి.ఆర్.డి.ఓ., ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తదితరులు పాల్గొన్నారు.



'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా

అకడమిక్, ఆఫీస్ ఫైల్స్ నిర్వహణ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 12 : డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్ చెరు లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేడు కార్యాలయంలో అకాడమిక్ మరియు ఆఫీస్ ఫైల్స్ నిర్వహణ కార్యక్రమాన్ని చేపట్టారని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం ప్రవీణ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల కార్యాలయంలో గల సెక్షన్ వారిగా ఫైళ్లను వేరుచేసి పాత ఫైల్స్ మరియు కొత్త ఫైల్స్ ను సరైన పద్ధతిలో అమర్చడం ద్వారా తదుపరి కార్యాలయ మరియు అకాడమిక్ పనులు నిర్వర్తించుటకు సులభంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ పూనంకుమారి, ఎగ్జామినేషన్ బాధ్యులు డాక్టర్ మల్లిక, అకాడమిక్ మరియు అటానమస్ బాధ్యులు డాక్టర్ పి సుజాత, డాక్టర్ ఏ వెంకటేశం, సూపరింటెండెంట్ అజయ్ కుమార్, కార్యాలయ సిబ్బంది అరుణ్ కుమార్, చంద్రశేఖర్, సంగమేశ్వర్ రాజమణి, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



గడప గడపకు కాంగ్రెస్

ప్రజా పాలన చేరాలి

- **అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలి**
- **టీజిఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 12: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సంగారెడ్డి జిల్లాలోని మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు, గ్రామ పంచాయతీల సర్పంచులు మరియు మున్సిపల్ వార్డ్ కౌన్సిలర్లకు ఒక రోజు అవగాహన సదస్సు గురువారం జరిగింది. కంది మండల కేంద్రం లోని ఎల్ఎన్ కన్వెన్షన్ లో జరిగిన ఈ అవగాహన సదస్సు కు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా 06 మార్చి నుండి 12 మార్చి వరకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ప్రజాప్రతినిధులకు ఈ కార్యక్రమం లక్ష్యాలు, అమలు విధానం మరియు ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాలపై. ప్రజా ప్రతినిదులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజల ప్రభుత్వం అన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలని, కాంగ్రెస్ ప్రజా పాలన గడప గడపకు చేరాలని అందుకు ప్రజా ప్రతినిధులందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ ప్రభుత్వ పథకం మహిళల పేరు మీదే మంజూరు అవుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారత కు పెద్ద పీట వేస్తున్నదని వివరించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా, సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, సంగారెడ్డి జిల్లా లోని సర్పంచులు, కౌన్సిలర్లులు పాల్గొన్నారు.



నర్సింగ్ కళాశాల విద్యార్థుల కోసం నూతన బస్ వితరణ

సంగారెడ్డి పట్టణం లోని మెడికల్ కళాశాల అనుబంధంగా ఉన్న నర్సింగ్ కళాశాల విద్యార్థుల కోసం తోషిబా సంస్థ తన సీఎస్సార్ నిధులతో బస్సు ను బహూకరించింది. మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి గురువారం కలక్టరేట్ ప్రాంగణం లో లాంఛనంగా బస్సు ను ప్రారంభించారు. ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో పలువురు రైతులకు పనిముట్లు, ట్రాక్టర్లను పంపిణీ చేశారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా లేక

రైతుల పంటలు ఎండిపోతున్నాయి

- **మాజీ మంత్రి హరీష్ రావు**



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 12: కోహిర్ సబ్ స్టేషన్ ను మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యేలు మాణిక్ రావు, చింత ప్రభాకర్ లు ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు 24గంటల పాటు ద్యుత్ ఇస్తున్నట్లు అసెంబ్లీ లో పేర్కొన్నారు, రైతులకు కేవలం 12గంటల విద్యుత్ సరఫరా జరుగుతోందని స్పష్టం చేశారు. ఆ విద్యుత్ సరఫరా లో సైతం పలుమార్లు ట్రిప్ అవుతోందని, లైన్ బ్రేకింగ్, ఎల్ సి ల పేరిట అంతరాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా లేక రైతుల పంటలు ఎండిపోతున్నాయని, విద్యుత్ సబ్ స్టేషన్ లాగ్ బుక్ లో సాయంత్రం 4గంటలకు త్రి ఫేస్ కరెంటు తీసేస్తే తెల్లారి 3గంటలకు ఇస్తున్నారని అయినా అధికారులు, ప్రభుత్వం 24గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు పేర్కొనడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ల మొత్తాన్ని తమ హయాంలో ఉన్న 4,900రూపాయలు ఉన్న డీడీ మొత్తాన్ని 9700రూపాయలకు పెంచారని, ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం అని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం లో వేలాది కొత్త విద్యుత్ కనెక్షన్ లు పెండింగ్ లో ఉన్నాయని స్టోర్ లలో మెటీరియల్ లేదని, కాలిన ట్రాన్స్ఫార్మర్ ల విషయం లో రైతులపై భారం మోపుతున్నారని, లోడ్ ఎక్కువ ఉన్న చోట్ల అదనపు డిటిఆర్ లు లేవని తెలిపారు. బ్యాంకులను, ఆర్థిక సంస్థలను మోసం చేయడానికి కొత్త డిస్కమ్ ను ఏర్పాటు చేస్తున్నారాని, ఉన్న రెండు డిస్కమ్ లను 55వేల కోట్ల రూపాయలు అప్పులు చేసి, నష్టాలపాలు చేసి కొత్త డిస్కమ్ ఏర్పాటు కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. సమ్మె చేస్తున్న 19647 మంది ఆర్టిజాన్ లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ ల సమ్మెకు మద్దత్తు పలుకుతున్నామని, మృతి చెందిన ఆర్టిజన్ ల పిల్లల విద్యార్హతలకు తగ్గట్టు గా ఉద్యోగాలు ఇవ్వాలన్నారు.



గత 8 ఏళ్లుగా అసత్య ప్రచారం చేస్తూ ఆన్‌లైన్‌లో వ్యక్తిగతంగా అటాక్ చేస్తూ వేధిస్తున్నారు. 24గంటల్లో వేధింపులు మితిమీరిపోయాయి. తన ఫ్యామిలీని కూడా లాగారు. ఇకపై ఊరుకునేది లేదు. 24 గంటల్లో ఆ కంటెంట్‌ను తొలగించకపోతే పరువునష్టం దావా వేస్తా.
- నటి రష్మిక

ఇంధన భద్రతపై భారత ప్రభుత్వం రాజీ

- మోడీపై విమర్శలు గుప్పించిన రాహుల్ గాంధీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 12: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర సర్కారుపై లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. గురువారం లోక్‌సభలో మాట్లాడిన ఆయన.. ఇంధన భద్రత విషయంలో భారత ప్రభుత్వం అమెరికాతో రాజీపడిందని ఆరోపించారు. ఈ రాజీతో వివిధ చమురు సరఫరాదారులతో తన సంబంధాలను నిర్ణయించే అధికారాన్ని అమెరికాకు కట్టబెట్టినట్లు అయ్యిందని ఆయన మండిపడ్డారు. అమెరికా - ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంతో భారత్ సుదీర్ఘ పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని రాహుల్ గాంధీ చెప్పారు. ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం హోర్ముజ్ జలసంధి గుండా జరుగుతుందని, జీవనాడి లాంటి ఆ జలసంధి మూతపడటం తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని అన్నారు. ముఖ్యంగా భారత్‌కు ఎక్కువ ఇబ్బందులు కలుగనున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఎందుకంటే మనం దిగుమతి చేసుకునే చమురు, సహజవాయువులో సింహభాగం హోర్ముజ్ జలసంధి నుంచే సరఫరా అవుతుందని చెప్పారు. నొప్పి ఇప్పుడిప్పుడే ప్రారంభమైందని, గ్యాస్ కొరత కారణంగా ఇప్పటికే రెస్టారెంట్‌లు మూతపడుతున్నాయని రాహుల్‌గాంధీ అన్నారు. వీధి వ్యాపారులపై గ్యాస్ కొరత తీవ్ర ప్రభావం చూపుతున్నదని వ్యాఖ్యానించారు. ప్రతి దేశానికి పునాది దాని ఇంధన భద్రతేనని ఆయన నొక్కి చెప్పారు. ఇది చిన్న విషయం కాదని, మనం ఎక్కడి నుంచి చమురు కొనుగోలు చేయాలి..? రష్యా నుంచి కొనాలా వద్దా అనేవి అమెరికా నిర్ణయించడం ప్రమాదకరమని అన్నారు.



విశ్వ వీక్షణం



ఎన్నికల కమిషనర్ అభిశంసన

- తీర్మానంపై 193 మంది ఎంపీల సంతకాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 12: కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై అభింసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. ఎస్ఐఆర్, ఓట్ చోరీ విషయంలో అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్న జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షపార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున ఎగువ సభ లేదా దిగువ సభలో సీఈసీని తొలగించాలనే నోటీసు ఇవ్వాలని వీరంతా భావిస్తున్నారు. సంతకాలు చేసిన వారొలో వీరిలో లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న వారు 130 మంది, రాజ్యసభకు చెందినవారు 63 మంది ఉన్నారు. 'సీఈసీ అభింశసనకు సంబంధించిన నోటీసులో ఎంపీలు ఉత్సాహంగా సంతకాలు చేశారు. పలువురు నాయకులు సైతం నోటీసులో సంతకం చేసేందుకు ముందుకొచ్చారు. అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టడానికి అవసమైన సంఖ్యా బలం ఇప్పటికే దాటేశాం' అని ప్రతిపక్ష ఎంపీ ఒకరు వెల్లడించారు. నిబంధనల ప్రకారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌ను తొలగించడానికి లోక్ సభలో అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టాలనుకుంటే కనీసం 100 మంది ఎంపీలు సంతకాలు చేయాలి. అదే రాజ్యసభలో 50 మంది సతంకాలు చాలు. శుక్రవారం ప్రతిపక్ష ఎంపీలు ఏదో ఒక సభలో నోటీసు ఇచ్చే అవకాశముంది. అదే జరిగితే స్వతంత్ర భారతంలో సీఈసీని తొలగించాలనే ప్రవేశపెట్టిన మొట్టమొదటి అభింశసన తీర్మానం ఇదే అవుతుంది.

సింగిడి
హైదరాబాద్
శుక్రవారం 13.03.2026
11
ప్రతిపక్షం
Prathipaksham.in



ఈ చేపలు కొవ్వును కరిగిస్తాయి

ప్రస్తుతం ఉన్న బిజీ లైఫ్ స్టైల్‌లో చాలా మంది శరీరంలో కొలెస్ట్రాల్ పెరిగిపోయి ఇబ్బంది పడుతున్నారు. అలాంటివారు తమ శరీరంలో కొలెస్ట్రాల్ ని కరిగించుకోవడానికి ఈ చేపల్లో రకాలు తింటే చాలట. మరి, అవేంటో తెలుసుకుందాం

కొలెస్ట్రాల్‌లో రెండు రకాలు ఉన్నాయి. అవి చెడు కొలెస్ట్రాల్ (తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రొటీన్), మంచి కొలెస్ట్రాల్ (అధిక సాంద్రత కలిగిన లిపోప్రొటీన్). ఈ రోజుల్లో చాలా మంది ప్రజలు అనారోగ్యకరమైన జీవనశైలి, సరైన ఆహారం కారణంగా అధిక కొవ్వు సమస్యతో బాధపడుతున్నారు. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి పెరిగితే గుండెకు వెళ్లే రక్తం బ్లాక్ అయి గుండెపోటు వస్తుంది. అంతే కాకుండా అధిక రక్తపోటు వల్ల స్ట్రోక్ వంటి సమస్యలు వస్తాయి. అయితే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా శరీరంలోని అదనపు కొలెస్ట్రాల్‌ను సహజ పద్ధతిలో సులభంగా తగ్గించుకోవచ్చు. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడే కొన్ని రకాల చేపలు ఉన్నాయని మీకు తెలుసా? వీటిని ఆహారంలో చేర్చుకుంటే శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి కొద్దికొద్దిగా తగ్గడం ప్రారంభమవుతుంది. అవి ఎలాంటి చేపలు అని ఇప్పుడు ఈ పోస్ట్ లో చూద్దాం.

1. ట్యూనా చేప

ఈ చేపలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ధమనులలో పేరుకుపోయే ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో ఈ యాసిడ్‌లు ఎంతగానో కృషి చేస్తాయి.




2. ట్రౌట్ చేప

ఈ చేపలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కూడా పుష్కలంగా ఉన్నాయి. మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించడంలో, మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో ఇవి ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.

3. హెర్రింగ్ చేప

ఈ రకమైన చేపలు EPA, DHA అనే రెండు రకాల



ముఖ్యమైన కొవ్వు ఆమ్లాలను అందిస్తాయి. శరీరంలో మంటను తగ్గించడంలో, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

4. మాకేరెల్ చేప

ఈ చేపలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. అలాగే ఈ చేప అనేక ఆరోగ్య ప్రయోజనాలతో నిండి ఉంది. ఈ చేప శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది.



5. సార్డినెస్

ఈ చేప ఒమేగా 3 కొవ్వు ఆమ్లాల అద్భుతమైన మూలంగా పరిగణిస్తారు. ఈ యాసిడ్ శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిని నిర్వహించడానికి చాలా సహాయకారిగా ఉంటుంది. ఈ చేపలో విటమిన్ డి, కాల్షియం, పొటాషియం, ఐరన్, సెలీనియం.ఫాస్పరస్ వంటి ఖనిజాలు ఉన్నాయి, ఇవి శరీరంలో రక్త స్థాయిని తగ్గించడంలో సహాయపడతాయి.







ఇరాన్‌లో ఇంకా 9వేల మంది భారతీయులు

- అందరినీ తీసుకొస్తాం: కేంద్రం

ప్రతిపక్షం, నేషనల్ డెస్క్: ఇరాన్‌లో ఇంకా దాదాపు 9,000 మంది భారతీయులు ఉన్నట్లు సూచన. దీంతో వారందరి భద్రతపై ప్రస్తుతం సందేహాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దీనిపై స్పందించింది. ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయులందర్నీ ఇండియాకు తీసుకొస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించింది. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ దీనిపై ప్రకటన చేశారు. ఇరాన్‌లో చిక్కుకున్న 9,000 మంది భారతీయుల్ని వెనక్కి తెచ్చేందుకు భారతీయ సంస్థలు నిరంతరం పని చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఇరాన్‌లో విద్యార్థులు, నౌకా సిబ్బంది, వ్యాపారస్తులు, యాత్రికులు, ఉపాధి కోసం వెళ్లిన వారు.. ఇలా వివిధ రంగాలకు చెందిన వారు 9,000 మంది ఉన్నారు. ఇప్పటికే వేల మంది ఇండియాకు చేరుకున్నప్పటికీ మిగిలినవారు అక్కడే ఉండిపోయారు. ఇప్పుడు వారు ఇరాన్ నుంచి బయటపడేందుకు అవసరమైన సాయం చేస్తున్నామని రణధీర్ అన్నారు. నేరుగా ఇండియాకు రాలేనివారు ఇరాన్‌కు దగ్గరగా ఉన్న అజర్‌బైజాన్, అర్మేనియా ద్వారా ఇండియా రావొచ్చని తెలిపారు. భారతీయ విద్యార్థులతో ఇరాన్ రాయబార కార్యాలయం నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, తగిన సమాచారం అందిస్తోందన్నారు. వారి రక్షణ, భద్రతకు ప్రాధాన్యమిస్తున్నామని వివరించారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో ఇప్పటివరకు ఇరాన్‌లో 2,000 మంది వరకు మరణించి ఉంటారని ఒక అంచనా. ఈ నేపథ్యంలో అక్కడ చిక్కుకుపోయిన భారతీయుల రక్షణ కోసం కేంద్రం చర్యలు తీసుకుంటోంది.



నేనెప్పుడు నియమాలను ఉల్లంఘించలేదు

- లోక్ సభ రూల్ ప్రకారమే నడుస్తుంది: స్పీకర్ ఓం బిర్లా

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 12: దేశంలోని 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమే లోక్‌సభ అని స్పీకర్ ఓం బిర్లా అన్నారు. ప్రతిపక్ష సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానం నిన్నటి సభలో వీగిపోయిన నేపథ్యంలో, గురువారం ఓం బిర్లా లోక్‌సభకు హాజరయ్యారు. తనపై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై 12 గంటల పాటు చర్చ జరిగిందని, ఈ క్రమంలో తన ప్రవర్తనపై ప్రతిపక్షం ఆందోళన వ్యక్తం చేసిన అంశాన్ని స్పీకర్ ప్రస్తావించారు. తాను ఎల్లప్పుడూ సభ నిర్దేశించిన నియమ నిబంధనలు, విధానాలకు లోబడే విధులు నిర్వర్తించినట్టు తెలిపారు. ఇకపై కూడా తన విధులను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహిస్తానని పునరుద్ఘాటించారు. మంత్రి అయినా, ప్రతిపక్ష ఎంపీ అయినా, సభలోని ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం మాట్లాడే హక్కు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కొంత మంది సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదన్న ఆరోపణలపై ఓం బిర్లా స్పందించారు. "ప్రతిపక్ష ఎంపీలకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని కొందరు సభ్యులు ఆరోపించారు. వాస్తవానికి మంత్రి అయినా లేదా ప్రతిపక్ష ఎంపీ అయినా, ఏ సభ్యుడైనా సరే, నిబంధనల ప్రకారం మాట్లాడే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని నేను స్పష్టం చేయాలని అనుకుంటున్నాను" అని బిర్లా పేర్కొన్నారు. సభా కార్యక్రమాలు సజావుగా జరగడానికి నిబంధనలు పాటించడం చాలా అవసరం అని ఓం బిర్లా అన్నారు. "సభ నిబంధనల ప్రకారమే నడుస్తుంది. ఈ నిబంధనలను ప్రభుత్వమో లేదా ప్రతిపక్షమే రూపొందించలేదు. నిబంధనలు అనేవి సభ్యులందరికీ సమానంగా వర్తిస్తాయి" అని ఆయన స్పష్టం చేశారు.





ధోనీకి భారీ ఊరట

ఐపీఎల్ 19వ సీజన్ ప్రారంభానికి ముందే మహేంద్ర సింగ్ ధోనీకి భారీ ఊరట లభించింది. పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందుతున్నారని అతడిపై వచ్చిన ఫిర్యాదును బీసీసీఐ ఎథిక్స్ ఆఫీసర్ తోసిపుచ్చారు. దాంతో.. చెన్నై సూపర్ కింగ్స్తరఫున మరోసారి తన మ్యాజిక్ చూపించేందుకు తలా సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే నెట్స్‌లో సాధన చేస్తున్న మహీ భాయ్.. కేసు కొట్టివేతతో మరింత జోరు పెంచనున్నాడు. భారత క్రికెట్‌లో వివాదరహితుడుగా పేరొందిన ధోనీపై పరస్పర విరుద్ధ ప్రయోజనాల కేసు అభిమానులకు ఒకింత ఆశ్చర్యం కలిగించింది. సీఎస్కే ఆటగాడిగా కొనసాగుతున్న ధోనీ.. ఒక క్రికెట్ అకాడమీ నడుపుతున్నాడు. ఆర్కా స్పోర్ట్స్ మేనేజ్ మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ అనే అకాడమీలో ధోనీ భాగస్వామిగా ఉన్నాడు. అందుకని.. బీసీసీఐ నియమ నిబంధనల ప్రకారం అతడు పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందుతాన్నరని ఫిబ్రవరి 28న ఫిర్యాదు నమోదైంది.



రాహుల్ ద్రవిడ్‌కు జీవిత సాఫల్య పురస్కారం

భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ కు అరుదైన గౌరవం లభించింది. సుదీర్ఘ కాలం ఆటగాడిగా, విజయవంతమైన కోచ్‌గా.. టీమిండియాకు విశేష సేవలందించిన 'ది వాల్'.. కల్నల్ సీకే నాయుడు జీవితకాల సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యాడు. సచిన్ టెండూల్కర్ తర్వాత ఈ అవార్డుకు ఎంపికైన తొలి క్రికెటర్‌గా ద్రవిడ్ గుర్తింపు సాధించాడు. మార్చి 15వ తేదీన నిర్వహించనున్న 'నమన్ అవార్డుల వేడుక'లో ఈ వెటరన్ ప్లేయర్‌కు బీసీసీఐ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందించనుంది. భారత క్రికెట్‌లో తనకంటూ ప్రత్యేక గౌరవం, గుర్తింపు సంపాదించుకున్న ఆటగాళ్లలో ద్రవిడ్ ఒకరు. తనదైన జిడ్డు ఆటతో టెస్టు క్రికెట్ లో ఓ వెలుగు వెలిగిన రాహుల్ ద్రవిడ్. ఆపై కోచ్‌గానూ హిట్ కొట్టాడు. నేషనల్ క్రికెట్ అకాడమీలో జూనియర్లను సానబెట్టిన ద్రవిడ్.. అనంతరం.. భారత జట్టు కోచ్‌గా అదుర్స్ అనిపించాడు. రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియాను పొట్టి వరల్డ్‌కప్ ఛాంపియన్‌గా నిలిపాడు ద్రవిడ్.

అవార్డు గ్రహీతలు వీళ్లే..

మొట్ట మొదటి టెస్టు జట్టు కెప్టెన్ సీకే నాయుడు పేరుతో బీసీసీఐ జీవితకాల సాఫల్య అవార్డులను ఇస్తోంది. భారత క్రికెట్‌కు విశేష సేవలందించిన ఆటగాళ్లను ఈ పురస్కారంతో గౌరవించడం ఆనవాయితీగా వస్తోంది. 1994లో తొలిసారి ఈ అవార్డును ప్రకటించారు. ఆ ఏడాది లాల్ అమర్‌నాథ్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించారు. ఇప్పటివరకూ 17 మంది ఈ అవార్డును స్వీకరించారు. లాల్ అమర్‌నాథ్, సయ్యద్ ముస్తాక్ అలీ, మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ, బీ.ఎస్.బేడీ, చంద్రశేఖర్, ఈ.ఏ.ఎస్. ప్రసన్న, వెంకట రాఘవన్, గుండప్ప విశ్వనాథ్, అజిత్ వాడేకర్, సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్, సయ్యద్ కీర్మాణీ, కృష్ణమాచారి శ్రీకాంత్, అంజుమ్ చోప్రా, ఫారూక్ ఇంజనీర్, రవి శాస్త్రి, సచిన్ టెండూల్కర్ ఈ పురస్కారాన్ని అందుకోగా.. ఇప్పుడు రాహుల్ ద్రవిడ్ సైతం వీరి సరసన చేరాడు. టీ20 ప్రపంచకప్ టోర్నీలో ఆడలేకపోయిన శుభ్‌మన్ గిల్ 'క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డుకు ఎంపికయ్యాడు.



ఐపీఎల్‌లో కొత్త రూల్స్

- ప్రాక్టీస్ సెషన్లోనూ షరతులు

ఐపీఎల్ తొలి దశ షెడ్యూల్ ప్రకటనతో ప్రాక్టీస్ సెషన్‌ల జోరు పెంచిన ఫ్రాంచైజీలకు బీసీసీఐ పెద్ద షాకిచ్చింది. మెగా టోర్నీ చరిత్రలో నెట్స్ ప్రాక్టీస్ కు సంబంధించి కీలక మార్పులు చేసింది. ప్రాక్టీస్ సెషన్ విషయమై.. కొన్ని నిబంధనలతో కూడిన మార్గదర్శకాలను గురువారం బీసీసీఐ వెల్లడించింది. ఇంతకుముందులా ఇరుజట్ల ఆటగాళ్లు ఒకే పిచ్ మీద సాధన చేయడం కుదరదని బీసీసీఐ తేల్చి చెప్పింది. 19వ సీజన్ నుంచే ఈ షరతు వర్తిస్తుందని ఫ్రాంచైజీలకు స్పష్టంగా చెప్పింది. ఐపీఎల్ 19వ సీజన్‌కు కౌంట్‌డౌన్ మొదలవ్వడంతో.. ఆటగాళ్లంతా నెట్స్ ప్రాక్టీస్‌కు సిద్ధమవుతున్నారు. తొలి దశలో 20 మ్యాచ్‌ల షెడ్యూల్ ప్రకటనతో.. విజయంతో టోర్నీని ఆరంభించాలని ఫ్రాంచైజీలు పట్టుదలతో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారి ఉత్సాహంపై నీళ్లు చల్లుతూ షరుతులు వర్తిస్తాయని బీసీసీఐ కీలక హెచ్చరిక చేసింది. ఇంతకుముందులా ఒకే పిచ్ మీద రెండు జట్ల ఆటగాళ్లు సాధన చేయడం కుదరని కొత్త నియమాన్ని తీసుకొచ్చింది భారత బోర్డు. 'మ్యాచ్‌కు ముందు ఇరుజట్ల ఆటగాళ్లు నెట్స్ ప్రాక్టీస్ సమయంలో వేర్వేరు పిచ్‌లను ఉపయోగించాలి. ఒకజట్టు సాధన చేస్తున్నప్పుడు.. ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లు మైదానంలోకి వస్తే వారికోసం కొత్త నెట్స్‌ను సిద్ధం చేయాలి. మొదటి జట్టు ప్రాక్టీస్ త్వరగా పూర్తైన సరే.. రెండో జట్టు మాత్రం ఆ పిచ్‌ను వాడొద్దు. త్రో డౌన్స్ కోసం కూడా మరో జట్టు ఆటగాళ్లు సాధన చేసిన పిచ్‌ను ఉపయోగించకూడదు' అని కొత్త నిబంధనకు సంబంధించిన నియమాలను ఐదు పేజీల్లో బీసీసీఐ వెల్లడించింది.



తండ్రి మెడలో టీ20 మెడల్ వేసిన శివం దూబే


పొట్టి ప్రపంచకప్‌లో భారత జట్టు విజయాల్లో కీలకమైన శివం దూబేపై ప్రశంసలు కురుస్తున్నాయి. టీమిండియా వరుసగా రెండోసారి విజేతగా నిలవడంలో దూబే కనిపించని హీరో అని మాజీ ఆటగాళ్లు అతడిని ఆకాశానికెత్తేస్తున్నారు. అయితే.. భారత స్టార్ మాత్రం తాను రియల్ హీరోగా భావించే వ్యక్తిని అభిమానులకు పరిచయం చేశాడు. ఆయన ఎవరో కాదు అతడికి జన్మనిచ్చిన తండ్రి. పొట్టి ప్రపంచకప్ విజేతలుగా ఇళ్లకు చేరుకున్న భారత ఆటగాళ్లు తమ సంతోషాన్ని కుటుంబంతో పంచుకుంటున్నారు. ఆల్‌రౌండర్ శివం దూబే మాత్రం తన తండ్రి రాజేశ్ దూబే మెడలో ప్రపంచకప్ మెడల్ వేసి సంబురపడ్డాడు. టీమిండియా జెర్సీ ధరించిన తండ్రి మెడలో తనకు బహుమతిగా లభించిన మెడల్ వేసి మురిసిపోయాడు. ఆ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టాడు దూబే. 'నా జీవితలో నిజమైన హీరో' అనే క్యాప్షన్‌తో అతడు పెట్టిన ఫొటోలు నెట్టింట వైరలవుతున్నాయి. ఐపీఎల్ సంచలనంగా భారత టీ20 జట్టులోకి దూసుకొచ్చిన శివం దూబే.. నమ్మదగిన ఆటగాడిగా ఎదిగాడు. రెండేళ్ల క్రితం పొట్టి ప్రపంచకప్‌లో పర్లేదనిపించిన దూబే.. ఈసారి మాత్రం మెరుపు ఇన్నింగ్స్‌లతో చెలరేగాడు. చేసింది కొన్నిపరుగులే అయినా.. భారత జట్టు విజయానికి అవి ఎంతో కీలకమయ్యాయి.



డాల్బీ సినిమాస్ ఫార్మాట్‌లో 'పెద్ది'

ఏప్రిల్ 30న రిలీజ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పాన్‌ఇండియా యాక్షన్ డ్రామా పెద్ది పోస్ట్‌ప్రొడక్షన్, ప్రమోషనల్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. బుచ్చి బాబు సనా దర్శకత్వంలో, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్రం మరో ప్రత్యేకతను సొంతం చేసుకుంది. ఈ చిత్రం అత్యాధునిక డాల్బీ సినిమాస్ ఫార్మెట్ లో కూడా విడుదల కానుంది. రామ్ చరణ్ మాస్ రగ్గడ్ అవతార్‌ను డాల్బీ సినిమాస్ ఫార్మెట్ లో చూడడం ప్రేక్షకులకు మరింత గ్రాండ్ ఎక్స్‌పీరియన్స్ అందించనుంది. పెద్ది వంటి భారీ యాక్షన్, ఎమోషన్ కలిగిన సినిమాను డాల్బీ సినిమాస్ లో చూడడం ప్రేక్షకులకు పూర్తిగా లీనమయ్యే అనుభూతిని ఇవ్వనుంది. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్‌లో రామ్ చరణ్ రగ్డ్ అవతార్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. చేతిలో బ్యాట్ పట్టుకుని, ఇంటెన్స్ లుక్‌తో కనిపిస్తున్న ఆయన క్యారెక్టర్ సినిమాలో పవర్‌ఫుల్ యాక్షన్‌ను సూచిస్తోంది. ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. పెద్ది ప్రమోషనల్ కంటెంట్ ఇప్పటికే సంచలనం క్రియేట్ చేస్తోంది. పెద్ది ఫస్ట్ షాట్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఎఆర్ రెహమాన్ అందించిన సౌండ్‌ట్రాక్స్ మెగా చార్ట్ బస్టర్ హిట్స్ గా నిలిచాయి. చికిరి చికిరి, రైరై రా రా పాటలు వరల్డ్ వైడ్ వైరల్ అయ్యాయి. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ ఇతర ప్రముఖ పాత్రలను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. సినిమాటోగ్రాఫర్ ఆర్ రత్నవేలు, ఎడిటర్ నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా. "పెద్ది" సమ్మర్ సీజన్‌లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలువడానికి సిద్ధమౌతోంది.



కాలరే ఎత్తరా...

'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుంచి బిగ్గెస్ట్ మాస్‌బస్టర్ విడుదల


'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నా. ఇప్పటివరకు ఈ చిత్రం నుంచి విడుదలైన ప్రతి పాట, టీజర్ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను అందుకున్నాయి.ఆ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ తాజాగా చిత్రబృందం మూడో గీతం 'కాలరే ఎత్తరా'ను విడుదల చేసింది. గురువారం సాయంత్రం అభిమానుల కోలాహలం నడుమ హైదరాబాద్ లోని మైత్రి విమల్ థియేటర్ లో ఈ గీతావిష్కరణ వేడుక వైభవంగా జరిగింది. 'కాలరే ఎత్తరా' పాట విడుదలతో సినిమాపై ఉన్న ఆసక్తి మరింత పెరిగింది. భారీ స్థాయిలో రూపొందించిన ఈ పాటలో భారీ సెట్‌లు, కట్టిపడేసే విజువల్స్, అద్భుతమైన ఎనర్జీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ తన ప్రత్యేకమైన స్టైల్, ఎనర్జీ, డ్యాన్స్ స్టెప్పులతో తెరపై వెలుగులు నింపారు. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ అద్భుతమైన సంగీతం, రామ్ మిర్యాల ఉత్సాహభరితమైన గానం, కాసర్ల శ్యామ్ శక్తివంతమైన సాహిత్యం కలిసి.. సినిమా యొక్క మాస్ అప్పీల్‌ను ప్రతిబింబించేలా గొప్పగా ఉంది ఈ గీతం.



డబ్బు – కుటుంబం – ఆధునిక ఆశయాల నేపథ్యంతో

ఆకట్టుకుంటున్న 'కార్మేని సెల్వం' టీజర్

పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్, బడవ గోపీ, కోతండం, కరణ్ చక్రవర్తి, శంకర నారాయణ్ వి, హరిత పరాకోడ్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఈ చిత్రం థియేటర్స్‌లోకి రాబోతుంది. ఆధునిక కాలానికి అనుసంధానమైన ఈ కథ ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో మంచి ఆసక్తిని పెంచగా.. గురువారం తెలుగు టీజర్ ను రిలీజ్ చేసింది చిత్ర యూనిట్. "డబ్బు సంపాదించడానికి చాలా మార్గాలు ఉన్నాయి" అని సముద్రఖని వాయిస్ ఓవర్ తో ప్రారంభమైన టీజర్ సినిమాపై క్యూరియాసిటిని పెంచుతుంది. అధిక ఖర్చులు, భారీ లోన్లు, క్రిప్టో పెట్టుబడులు, త్వరగా ధనవంతులు కావాలనే ఆశతో చేసే ప్రయత్నాలు వంటి విషయాలను వివిధ కోణాల్లో చూపిస్తూ నేటి సమాజంలో డబ్బు పట్ల ఉన్న ఆలోచనలను చూపించిన విధానం ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా ఈఎంఐలు, క్రెడిట్ కార్డ్ ఆధారిత జీవనశైలి, డబ్బు కోసం మనుషులు తీసుకునే నిర్ణయాలు కథలో కీలక పాత్ర పోషించబోతున్నాయని అర్థమవుతుంది. సముద్రఖని కుటుంబంతో కనిపించే సన్నివేశాలు హృదయానికి హత్తుకునేలా ఉంటాయి. లక్ష్మీ ప్రియా చంద్రమౌళి ఆయన భార్యగా, చిన్న కుమారుడితో కుటుంబ జీవితం చూపిస్తుండగా, మరోవైపు విదేశాల్లో ఒంటరిగా కనిపించే కొన్ని షాట్లు కథపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. గౌతమ్ వాసుదేవ్ మీనన్ పాత్రను గోప్యంగా ఉంచడం కూడా ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచుతోంది. టీజర్ చివర్లో.."రిచ్ కావాలంటే రిచ్ మనిషిలా ఖర్చు చేయడం నేర్చుకోవాలి.. డబ్బు లేకపోతే అప్పు తీసుకుని ఖర్చు చేయాలి" .. అని సముద్రఖని చెప్పే డైలాగ్ ప్రేక్షకులలో ఆలోచన రేకెత్తించేలా నిలుస్తుంది. ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదల కానుంది.



'వృషకర్మ' కోసం నాగ చైతన్య ట్రాన్స్‌ఫార్మేషన్

యువ సామ్రాట్ నాగ చైతన్య తన అప్ కమింగ్ నెవర్ బిఫోర్ మిథికల్ స్పెక్టకిల్ 'వృషకర్మ' కోసం చాలా హార్డ్ వర్క్ చేస్తున్నారు. 'విరూపాక్ష'తో బ్లాక్ బస్టర్ సాధించిన కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని SVCC, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి, బాపినీడు ఈ వెంచర్‌ను సమర్పిస్తున్నారు. BVSN ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'వృషకర్మ' గ్లింప్స్ అన్ని ప్లాట్ ఫామ్‌లు, ప్రేక్షకుల నుండి అద్భుతమైన స్పందనను పొందింది. వెంటనే వైరల్ అయ్యి భారీ సంచలనాన్ని సృష్టిస్తోంది. ఇంటెన్స్ విజువల్స్, పవర్ ఫుల్ వరల్డ్ బిల్డింగ్ అందరినీ ఆశ్చర్యపరిచాయి, సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. మేకర్స్ ఈరోజు యువ సామ్రాట్ నాగ చైతన్యను ఫియర్సెస్ట్ ట్రాన్స్‌ఫర్మేషన్ లో ప్రజెంట్ చేసే సరికొత్త BTS స్టిల్స్‌ను రిలీజ్ చేశారు. ఈ ఫోటోలు పాత్ర కోసం ఆయన చేసిన కఠినమైన ట్రాన్స్‌ఫర్మేషన్, అలాగే అర్జున్ పాత్రను సహజంగా తెరపై చూపించేందుకు పెట్టిన అంకితభావాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200